# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :149 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 16-08-2025 | పేజీలు:4 వెల: 2.00


## నల్లగొండ జిల్లాలో నడిరోడ్డుపై గంజాయి బ్యాచ్ వీరంగం..

నల్లగొండ : గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామని కాంగ్రెస్ సర్కార్ ప్రగల్భాలు పలుకుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. రాష్ట్రంలో రోజు రోజుకి గంజాయి బ్యాచ్ ఆగడాలు పెరిగిపోతున్నాయి.నల్గొండ జిల్లాలో నడి రోడ్డుపై గంజాయి బ్యాచ్ వీరంగం సృష్టించింది. తిప్పర్తిలో పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న సంజీవరెడ్డి అనే కుటుంబంపై.. గంజాయి మత్తులో యువకులు దాడి చేసి బీభత్సం సృష్టించారు. తిప్పర్తి హైవేపై అటుగా వెళ్ళే ఆర్టీసీ బస్సుపైన దాడి చేశారు. అంతటితో ఆగకుండా ఓ లారీ మీదకు ఫోన్ విసిరికొట్టాడు. వేగంగా వెళ్తున్న వాహనాలకు అడ్డుగా వెళ్లి.. భయానక వాతావరణం సృష్టించారు. గంజాయి బ్యాచ్ వీరంగంతో స్థానికులు, వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. గంజాయి సేవించి.. దాడులకు పాల్పడుతున్న యువకులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు పోలీసులను డిమాండ్ చేస్తున్నారు.

## రాష్ట్రంలో కొత్త చరిత్ర రాశాం..



హైదరాబాద్,సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్ పాలన అని, దీనికి చరిత్రే సాక్ష్యం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో ఆధునికత, సంక్షేమంలో సరికొత్త చరిత్రను రాస్తూ..తెలంగాణను 20 నెలల కాలంలోనే దేశానికి రోల్ మోడల్‌గా నిలబెట్టాం అని చెప్పారు. ద్విముఖ విధానంతో తమ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. తమ ఆలోచనలో స్పష్టత ఉందని, అమలులో పారదర్శకత ఉందన్నారు. అందరినీ కలుపుకుని, అద్భుతాలు సృష్టించే సమ్మిళిత అభివృద్ధి విధానాన్ని తాము ఎంచుకున్నాం అని సీఎం చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటలో జాతీయ పతాకాన్ని సీఎం రేవంత్ ఆవిష్కరించారు. భారత ప్రజలకు 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు.'దేశ స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలు త్యాగం చేసిన మహనీయులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. గాంధీజీ సారథ్యంలో సాగిన భారత స్వాతంత్ర్య పోరాటం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. అహింసే అస్త్రంగా మహా సంగ్రామాన్ని గెలిచి ప్రపంచానికి సరికొత్త పోరాట పంథాను పరిచయం చేసింది. మహాత్ముడి సారథ్యంలో బయట శత్రువులైన బ్రిటీషర్లపై యుద్ధం గెలిచాం. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ సారథ్యంలో ప్రజాస్వామ్య పాలనకు పునాదులు వేసుకున్నాం. ఆనాడు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చేసిన ప్రసంగం కోట్ల మంది భారతీయులను ఐక్యం చేసి, లక్ష్యం వైపు నడిచేలా చేసింది. కేవలం ప్రసంగాలు ఇవ్వడంతోనే సరిపెట్టలేదు, ఆ దిశగా కార్యచరణ తీసుకుని దేశ పురోగతికి బలమైన పునాదులు వేశారు. దృఢమైన ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద, గణతంత్ర దేశంగా భారత్‌ను నిలబెట్టడంలో గొప్ప రాజనీతిజ్ఞత ప్రదర్శించారు. పంచవర్ష ప్రణాళికల ద్వారా వ్యవసాయ, పారిశ్రామిక, వైజ్ఞానిక, సాంకేతిక రంగాల్లో దేశాన్ని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దారు. ఆ నాటి స్ఫూర్తిని, ఆ మహనీయుల వారసత్వాన్ని కొనసాగిస్తూ.. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్రభాగాన నిలబెట్టే లక్ష్యాలతో మేం పరిపాలన సాగిస్తున్నాం. స్వాతంత్ర్యం సిద్ధించే సమయానికి దేశం అల్లకల్లోల పరిస్థితుల్లో ఉంది. శూన్యం నుండి మన ప్రయాణం మొదలైంది. శిఖరాలే లక్ష్యంగా సంకల్పం తీసుకుని మన పెద్దలు ఈ దేశాన్ని ముందుకు నడిపించారు. ఈ రోజు మనం చూస్తున్న ఆధునిక భారతం ఐదేళ్లలోనో, పదేళ్లలోనో సాధించిన విజయం కాదు. దీని వెనుక 79 ఏళ్ల కఠోర శ్రమ ఉంది. ఎందరో గొప్ప నాయకుల త్యాగం, చెమట, రక్తం ఉంది. ఈ సుదీర్ఘ ప్రస్థానం తర్వాతే నేడు మనం ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తున్నాం. వారు అందించిన ఈ ఘనమైన వారసత్వాన్ని విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లడం మన ముందున్న కర్తవ్యం. ఆ బాధ్యత నిర్వర్తించడంలో నేను సదా సిద్ధంగా ఉంటాను. ఆ స్ఫూర్తితోనే తెలంగాణలో ప్రజా ప్రభుత్వం పని చేస్తోంది' అని సీఎం రేవంత్ చెప్పారు.'2023 డిసెంబర్ 7న మేము బాధ్యతలు స్వీకరించగానే రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాం. ప్రజలు, ఉద్యమకారులు, అమరవీరుల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా విధాన నిర్ణయాలు తీసుకున్నాం. రైతులు, మహిళలు, యువత భవితకు పెద్దపీట వేశాం. సామాజిక తెలంగాణ ఆవిష్కరణకు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నాం. కుల గణనతో బలహీనవర్గాల వందేళ్ల కలను నిజం చేశాం. ఎస్సీ వర్గీకరణతో దశాబ్దాల నిరీక్షణకు తెరదించాం. ఇవి గొప్ప నిర్ణయాలు మాత్రమే కాదు.. అత్యంత సాహసోపేత నిర్ణయాలు కూడా. ఒక వైపు ప్రపంచ నగరాలతో పోటీ పడే లక్ష్యాలు నిర్దేశించుకున్నాం. మరో వైపు పేదల ఆకాంక్షలు తీర్చే సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం. ద్విముఖ విధానంతో మా ప్రభుత్వం పాలన సాగిస్తోంది. మా ఆలోచనలో స్పష్టత ఉంది, అమలులో పారదర్శకత ఉంది. అందరినీ కలుపుకుని, అద్భుతాలు సృష్టించే సమ్మిళిత అభివృద్ధి విధానాన్ని మేం ఎంచుకున్నాం. పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో ఆధునికత, సంక్షేమంలో సరికొత్త చరిత్రను రాస్తూ తెలంగాణను 20 నెలల కాలంలోనే దేశానికి రోల్ మోడల్ గా నిలబెట్టాం. సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్ పాలన, దీనికి చరిత్రే సాక్ష్యం. 70 ఏళ్లుగా పీడీఎస్ వ్యవస్థ పేద ప్రజల ఆహార భద్రతకు భరోసా ఇస్తోంది. అదే స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీని ప్రారంభించింది. 13 వేల కోట్ల రూపాయల వ్యయంతో 3.10 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం. ఈ రోజు ధనికులతో సమానంగా పేదవారు సన్న బియ్యంతో భోజనం చేస్తున్నారు. ఇది కేవలం ఆకలి తీర్చే పథకం కాదు.. ఆత్మగౌరవాన్ని చాటి చెప్పే పథకం. ఈ పథకం అమలు తీరును నేను స్వయంగా పర్యవేక్షించా. ఆ రోజు వారి కళ్లలో కనిపించిన ఆనందం, ఆత్మగౌరవం నాకు శాశ్వతంగా గుర్తుంటుంది. రేషన్ కార్డు ప్రజల ఆత్మగౌరవానికి మరో ప్రతీక. ఒక భరోసా.. భావోద్వేగం. ఆ భరోసా కోసం రాష్ట్ర ప్రజలు పదేళ్లు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూశారు. ప్రజా ప్రభుత్వం వచ్చాకే ఆ ఎదురుచూపులకు పరిష్కారం లభించింది. ఈ ఏడాది జూలై 14 నుంచి రాష్ట్రం వ్యాప్తంగా నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించాం. పదేళ్ల తర్వాత చేతిలో రేషన్ కార్డుతో రేషన్ షాపుల వద్ద సందడి కనిపిస్తోంది.

## కాశ్మీర్ క్లౌడ్ బరస్ట్ ఘటనలో 60కి చేరిన మృతులు

శ్రీనగర్,ఆగస్ట్15: జమ్మూకశ్మీర్ కొండల్లో ఆకస్మిక వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 60కి చేరుకుంది. గురువారం అమాంతంగా వరద ఉధృతి రావడంతో ప్రజలు కొట్టుకు పోయారు. ఈ ఘటనలో మరో 100 మందికి గాయాలైనట్లు- సీఎం ఒమర్ అబ్దుల్లా వెల్లడించారు. గల్లంతైన వారి కోసం రెండోరోజు ఆపరేషన్ కొనసాగుతోందన్నారు. ప్రధాని మోదీ ఫోన్ చేసి పరిస్థితుల గురించి ఆరా తీసినట్లు- చెప్పారు. అయితే, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు- భావిస్తున్నారు. జమ్మూలో గురువారం మేఘ విస్ఫోటనం విరుచుకుపడింది. ఫలితంగా మచైల్ మాతా దేవి దర్శనానికి వెళుతున్న యాత్రికులు బలయ్యారు. ఒక్కసారిగా వచ్చి పడిన ఆకస్మిక వరదతో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. చాలామంది గల్లంతయ్యారు. పలు భవనాలు, దుకాణాలు తుడిచిపెట్టు-కుపోయాయి. వరదల కారణంగా తీవ్ర విషాదం నెలకొనడంతో మచైల్ మాతా దేవి యాత్రను నిలిపివేశారు. అయితే స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘటనా సమయంలో అక్కడ దాదాపు 1200 మంది ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. కిశ్త్వాడ్‌లో రెస్క్యూ ఆపరేషన్ ముమ్మరం చేయడంలో భాగంగా ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అక్కడకు చేరుకున్నాయి. ప్రతికూల



వాతావరణం కారణంగా హెలికాప్టర్లు వెళ్లడం లేదని అధికారులు వెల్లడించారు. దీంతో సహాయక బృందాలు రోడ్డు మార్గాన్ని ఎంచుకున్నాయన్నారు. పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్, స్థానిక స్వచ్ఛంద సంస్థలతోపాటు- దాదాపు 300 మంది సైనిక బృందం రెస్క్యూ ఆపరేషన్‌లో నిమగ్నమైంది. ఇప్పటివరకు లభ్యమైన మృతదేహాల్లో 21 మందిని గుర్తించినట్లు- అధికారులు వెల్లడించారు.

## ఆ వార్తల్లో వాస్తవం లేదు.. త్వరలోనే తాండూరుకు వస్తా!



హైదరాబాద్, పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలను తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఖండించారు. గువ్వల బాలరాజును తానే బీజేపీలోకి పంపినట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు.ఇంకా కొంతమంది బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలను తీసుకొని బీజేపీలోకి తాను వెళ్తున్నట్లు వస్తున్న వార్తలు హాస్యాస్పదం అని పేర్కొన్నారు. సొంత పనుల మీద అమెరికా వచ్చానని, త్వరలోనే తాండూరు వస్తా అని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలను గెలిపించుకుంటా అని గువ్వల బాలరాజు తెలిపారు. ఈ మేరకు అమెరికా నుంచి రోహిత్ రెడ్డి వీడియో విడుదల చేశారు.'పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలను ఖండిస్తున్నా. గువ్వల బాలరాజును నేనే బీజేపీలోకి పంపినట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదు. ఇంకా కొంత మంది బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలను తీసుకొని బీజేపీలోకి వెళ్తున్నట్లు వస్తున్న వార్తలు హాస్యాస్పదంగా ఉన్నాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరినీ నమ్మవద్దు. బీజేపీ వేల కోట్ల కాంట్రాక్టులు ఇస్తామని, ఉన్నత పదవుల ఆశ చూపింది. తెలంగాణకు అన్యాయం చేయవద్దని బీఆర్ఎస్ కంకణబద్ధుడిగా, కేసీఆర్ మానసపుత్రుడిగా నేను సాహసం చేశాను. సొంతలాభం ముఖ్యం కాదని, తాండూరు అభివృద్ధి ముఖ్యమని భావించాను. కొంతమంది బీజేపీ నుంచి వచ్చిన వాళ్లను బహిరంగంగా ఆ రోజు ప్రపంచానికి పట్టించాను. ధైర్యసాహసాలు చేసిన ఈ తాండూరు బిడ్డ.. వేరే పార్టీలోకి వెళ్లే ప్రసక్తే లేదు' అని మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి స్పష్టం చేశారు.'తెలంగాణను అన్ని రకాలుగా ముందుకు తీసుకువెళ్లడానికి బీఆర్ఎస్ పార్టీతోనే వెళ్తా. ఇతర పార్టీలకు తొత్తులుగా మారిన మీడియాను హెచ్చరిస్తున్నా.. తప్పుడు ప్రచారం చేయవద్దని కోరుతున్నా. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నా. బీఆర్ఎస్ కార్యకర్తలకు పూర్తి క్లారిటీ ఉంది. బీఆర్ఎస్ లోకల్ బాడీ ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహించుకున్నాం. సొంత పనుల మీద అమెరికా వచ్చాను.. త్వరలోనే వస్తా. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలను గెలిపించుకుంటా. పార్టీ మార్పుపై ఎటువంటి ఆలోచన లేదు. త్వరలోనే తాండూరుకు వస్తా' అని రోహిత్ రెడ్డి తెలిపారు.

## సామాన్యులకు దీపావళి కానుక.. తగ్గనున్న జీఎస్టీ రేట్లు: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవ వేళ దేశ ప్రజలకు ప్రధాని మోదీ శుభవార్త చెప్పారు. ఈసారి దీపావళి రెండింతల ఆనందాన్ని తీసుకురాబోతున్నది అంటూ.. వస్తు,సేవల పన్ను విధానంలో కొత్త తరం సంస్కరణలను తీసుకువస్తున్నామని వెల్లడించారు. సామాన్యులపై భారం తగ్గించేలా పన్నుల్లో భారీగా కోత పెట్టనున్నామని, ఈసారి దీపావళి కానుకగా ఇవ్వబోతున్నామని ఎర్రకోట వేదికగా ప్రకటించారు. 'వెలుగుల పండుగ వచ్చేలోగా రాష్ట్రాలతో చర్చించి జీఎస్టీలో కీలకమైన మార్పులు, చేర్పులు చేస్తాం. సామాన్యులపై పన్ను భారాన్ని గణనీయంగా తగ్గించి, భారీ ఉపశమనాన్ని కలిగించేలా తమ సంస్కరణలు ఉంటాయి. వీటివల్ల చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలకు, ఎంఎస్ఎంఈలకు భారీ ప్రయోజనం చేకూరుతుంది. జీఎస్టీ సంస్కరణల తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు తగ్గి ప్రజలకు ఉపశమనం కలుగుతుంది. అదే సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుంది.ప్రతి కుటుంబానికి ఉపశమనం కలిగించేలా నిత్యావసర వస్తువులపై విధించే పన్నును తగ్గిస్తున్నాం. వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించమే లక్ష్యంగా జీఎస్టీ స్లాబులను మార్పుచేస్తున్నాం. ఈ దీపావళి నాటికి సామాన్యుల జీవితాన్ని మరింత సులభతరం చేసేలా, సరళీకృత జీఎస్టీ విధానాన్ని మీరు చూస్తారు. హైపవర్ కమిటీ ఏర్పాటు చేసి జీఎస్టీ సంస్కర్ణలు జరిపి ఈ దీపావళికి బహుమతిగా ఇస్తాం. సంస్కరణల విషయంలో ప్రతిఒక్కరు మాకు మద్దతు పలకాలి.అన్ని రంగాల్లోనూ సంస్కరణలు తెస్తున్నాం, ఈవిషయంలో వెనకడుగు వేసేది లేదు. ఏ నిర్ణయం తీసుకున్నా దేశ హితం కోసమే. విధాన, నిర్మాణాత్మక, ఆర్థిక సంస్కరణల విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే



లేదు. మార్పు అవసరమైన ప్రతిచోటా సంస్కరణలకు భారత్ సిద్ధంగా ఉంది. నగదు బదిలీ పథకం సామాన్య పేదలకు వరంగా మారింది. 25 కోట్ల మంది పేదలను దిగువ మధ్యతరగతి స్థాయికి తీసుకొచ్చింది. మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి సంయుక్త బలం భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నది. నైపుణ్యాభివృద్ధితో భారత యువత స్వయం ఉపాధి రంగాల్లో ముందడుగు వేస్తున్నది. ఎంతోమంది త్యాగధనుల వల్ల మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ఇప్పుడు మనం స్వయం సమృద్ధిని సాధించాలి. స్వయం సమృద్ధి అనే పదాన్ని మన నరనరాల్లో జీర్ణించుకోవాలి. స్వదేశీ అనే పదం బలహీనత కాదు, అది మన బలంగా చాటిచెప్పాలి. నాణ్యత విషయంలో రాజీపడొద్దని వ్యాపారులను అర్థిస్తున్నా. నాణ్యత అనేది మన దేశ బ్రాండ్ కావాలి' అని మోదీ అన్నారు.

## తెలంగాణ మళ్లీ బానిసత్వంలోకి పోయింది.. కేటీఆర్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్ : పంద్రాగస్టు సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ మళ్లీ బానిసత్వంలోకి పోయిందని, తన స్వాతంత్రాన్ని, స్వేచ్ఛను కోల్పోయింది అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కేటీఆర్ పాల్గొని, జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎన్నో కులాలు, ఎన్నో మతాలు, ఎన్నో భాషలు, ఎన్నో రాష్ట్రాలు కలిగి ఉన్న వైవిధ్య భారతానికి స్వాతంత్రం సిద్ధించి 79 ఏళ్లు అవుతున్న సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులందరికీ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ తరపున బీఆర్ఎస్ తరపున హృదయపూర్వకంగా స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. మన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం బలిపీఠం ఎక్కిన వేలాది మంది త్యాగధనులకు, ఆనాటి నాయకత్వానికి వినమ్ర పూర్వక శ్రద్ధాంజలి. 14 రాష్ట్రాలతో మొదలైన స్వతంత్ర భారతదేశ ప్రయాణం ఇవ్వాళ 28 రాష్ట్రాల వైవిధ్య భారతంగా విలసిల్లుతుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.అతి చిన్న వయసు కలిగిన తెలంగాణ రాష్ట్రం బీఆర్ఎస్ పాలనలో మొత్తం భారతదేశానికే ఆదర్శంగా నిలిచింది. గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ స్ఫూర్తితో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ పోరాటం జరిపి రాష్ట్రాన్ని సాధించుకున్నాం. అభివృద్ధి, సంక్షేమం, తలసరి ఆదాయం, వ్యవసాయ విస్తరణలో అద్భుత విజయాలను సాధించి.. జై జవాన్ జై కిసాన్ అనే నినాదాన్ని కేసీఆర్ నాయకత్వం నిజం చేసింది. ఎక్కడో 14 స్థానంలో ఉన్న తెలంగాణ 10 ఏళ్లలోనే పంజాబ్, హర్యానాను వెనక్కి నెట్టి ధాన్యం ఉత్పత్తిలో అగ్రభాగాన చేరడానికి రైతును రాజునే చేయాలన్న కేసీఆర్ సంకల్పమే కారణం అని పేర్కొన్నారు.ఐటీ రంగం, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి, పల్లె ప్రగతి, పేద వారికి సంక్షేమ కార్యక్రమాలు ఇలా ఏ రంగం తీసుకున్న పదేళ్లలో భారత దేశానికే లైట్ హౌజ్‌లాగా తెలంగాణ నిలబడ్డది. 20 నెలల కాంగ్రెస్ పాలన చూస్తుంటే బాధ కలుగుతుంది. రైతులు రాజు చేయాలన్న కేసీఆర్ తపన పక్కకు వెళ్లిపోయింది. స్వాతంత్ర దినోత్సవం వేళ యూరియా కోసం రైతులు చాంతాడంత లైన్లలో చెప్పులు పెట్టి క్యూ కడుతున్నారు. మళ్ళీ ఆనాటి పాత కాంగ్రెస్ రోజులను రేవంత్ రెడ్డి తీసుకొచ్చిండు. స్వాతంత్ర్యం అంటే సొంతంగా పరిపాలించుకోవడమే కాదు ఆత్మగౌరవంతో బతకడం. కేసీఆర్ నాయకత్వంలో పదేళ్ల పాటు ఆత్మగౌరవంతోనే బతికాం. కానీ ఇవ్వాళ మళ్లీ ఢిల్లీ పాలన తెలంగాణ ప్రజల నెత్తి మీద రుద్దపడిందని కేటీఆర్ ధ్వజమెత్తారు.ఢిల్లీ కిరాయి పాలన మొదలైంది. ఢిల్లీ పార్టీల పెత్తనం తెలంగాణలో నడుస్తుంది. 51 సార్లు ఢిల్లీకి ముఖ్యమంత్రి అప్ అండ్ డౌన్ చేశారు. ప్రతి చిన్న పనికి కూడా ఢిల్లీ వైపే చూడాల్సిన దుస్థితి ఇవాళ తెలంగాణలో ఉంది. తెలంగాణ మళ్లీ బానిసత్వంలోకి పోయింది. తన స్వాతంత్రాన్ని, స్వేచ్ఛను కోల్పోయింది. సంక్షేమంలో, వ్యవసాయంలో వెనుకబడ్డది. ఐటీ, పరిశ్రమలు తరలిపోతున్నాయి, దానికి ఢిల్లీ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ కారణం. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని పెద్దలు జయశంకర్ సార్ వేల సార్లు చెప్పారు. సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలి. ఆత్మగౌరవంతో బతకాలి. పేదలు ఆర్థిక స్వావలంబన సాధించాలని జయశంకర్ సార్ చెప్పేవారు. ఇవన్నీ జరగాలంటే కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష అన్న మాటను మీ అందరికి గుర్తు చేస్తున్నాను. కులం, మతం లాంటి ఎన్నో అంశాలు మనల్ని విడదీయవచ్చు. కానీ మనందరినీ కలిపి ఉంచేది భారతీయత ఒక్కటే అని కేటీఆర్ పేర్కొన్నారు.

### కిష్టావర్ ఘటనపై కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి

హైదరాబాద్ : జమ్మూకశ్మీర్‌లోని కిష్టావర్ జిల్లాలో వరదలు సంభవించి 46 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కిష్టావర్ జిల్లాలో వినాశకరమైన తుపాను సంభవించి 46 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. 100 మందికి పైగా గాయపడడం, ఇంకా చాలా మంది ఆచూకీ తెలియడం లేదన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## కేసీఆర్ పన్నులు తగ్గిస్తే.. రేవంత్ రెడ్డి పెంచుతుండు

సిద్దిపేట : తెలంగాణలో కేసీఆర్ పన్నులు తగ్గిస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం పన్నులను పెంచుతుండు అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలపై పన్నుల భారం మోపుతున్న రేవంత్‌పై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. సిద్దిపేటలోని తన క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.రెండేళ్ల రేవంత్ పాలనలో ప్రజలపై అప్పుల, పన్నుల భారం ఎక్కువైపోయిందన్నారు. ప్రజలపై పన్నులు వేయడం లేదని శాసనసభలో చెబుతున్నారు. అసలే ఆర్థిక మాంద్యం.. వరసగా రెండో నెల డిఫ్లేషన్‌లో ఉంది.. తెలంగాణలో వరసగా ఇది రెండో సారి. పాలనలో కాంగ్రెస్ పూర్తిగా విఫలం. రోజుకో పన్ను వేస్తూ ప్రజలకు షాక్ ఇస్తున్నది. గత నెల, ఈ నెలలో ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌లో రెండు వేల కోట్ల భారం పడిందన్నారు.గతంలో రూ. 100గా ఉన్న సర్వీస్ టాక్స్‌ను ఇప్పుడు రూ. 200లు చేశారు. వెహికిల్ సర్వీస్ టాక్స్ రూ. 400 నుంచి వన్ పర్సంటేజ్‌కు పెంచారు. రోడ్ టాక్స్‌నూ పెంచారు. మోటార్ సైకిల్ టాక్స్‌ను నాలుగైదు వేలకు పెంచారు. పెనాల్టీల పేరిట గత నెల వెయ్యి కోట్లు, ఈ నెల వెయ్యి కోట్లు మొత్తం రెండు వేల కోట్ల భారం మోపారు. గతంలో రూ. 7100 కోట్లు టాక్స్ వసూలు అయితే.. గతేడాది రూ. 6900 కోట్లు మాత్రమే వచ్చింది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గింది. బడ్జెట్ రూ. 8000 కోట్లు అంచనా వేశారు.. ఇదేలా సాధ్యం అని హరీశ్‌రావు ప్రశ్నించారు.అసెంబ్లీలో సుద్దపూస మాటలు.. వాస్తవంలో అన్ని పన్నుల పెంపు. పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో ట్రాన్స్‌పోర్టులో ట్యాక్సులు రద్దు చేసి.. పేదలకు సాయం చేశామన్నారు. పేదలపై ఈ పన్నుల భారాన్ని ఈ ప్రభుత్వం తొలగించాలి. రేవంత్ రెడ్డి తుగ్లక్ చర్యల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నరు.



మేము పన్నులు తొలగిస్తే.. మీరు పన్నులు వేస్తున్నారు.. ఇదేనా మార్పు. ఆర్ అండ్ బి, పీఆర్‌లో అన్యూటి మోడల్‌లో రోడ్లు వేయాలని కుట్ర చేస్తున్నారు. ప్రజలపై దొడ్డి దారిన భారం వేసి ఆ అప్పులు కడతారు.. దీన్ని ఉపసంహరించుకోవాలి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.పండగలు వస్తే పాపం.. పండగకు ముందు వారం, పండగ తరువాత వారం ఆర్టీసీ ఛార్జీలు డబుల్ చేస్తున్నారు. కాంగ్రెస్ పంచుడు బంద్ చేసి, పెంచుడు షురూ చేసింది. మద్యం ధరలు రెండు సార్లు పెంచారు. ప్రతి గ్రామానికి మద్యం షాపులు తెరుస్తారట.. భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీలు కూడా రెపో మాపో పెంచుతారట. పేద ప్రజల రక్తమాంసాలు పీల్చుతారా..? ఢిల్లీకి డబ్బుల సంచులు మోసుడు తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదు. నీ ఆర్ఆర్ టాక్స వల్ల రాష్ట్రంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ తగ్గింది అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## సంపాదకీయం

**శనివారం 16-08-2025**

# రాయితీలు కార్పోరేట్లకు – పేదల బాధ్యత చిరుద్యోగులకు

గుజరాత్ లోని ఆనంద్‌లో పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సందర్భంగా ఓ పిల్లవాడు నన్ను తెలివైన ప్రశ్న వేశాడు. 'మన శత్రువు ఎవరు?' అని. నాకా ప్రశ్న నచ్చి తక్కిన విద్యార్థుల ముందు పెట్టి వారి అభిప్రాయాలు అడిగాను. "పేదరికమే మన శత్రువు" అని అప్పుడు వచ్చింది జవాబు. – డా॥ఎ.పి.జె.అబ్దుల్ కలాం చాలా కాలం కిందట చెప్పారు. ఇప్పటికీ మన శత్రువు పేదరికమే. దానిని పారదోలేందుకే కమ్యూనిస్టు పోరాటాలు. అయితే పాలకవర్గ పార్టీల హామీలు, ఎజెండాలతో 78 ఏళ్ల స్వాతంత్ర్య పాలనలో ప్రభుత్వాలకు ఇది సాధ్యపడలేదు. ఇప్పుడు మన ముఖ్యమంత్రి గారు పేదరికాన్ని రూపుమాపడానికి పి-4 (ప్రభుత్వం, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్) అనే ఒక కొత్త పల్లవి అందుకున్నారు.

పి-4 ప్రైవేటీకరణ నుండి పేదరికం వరకు

దేశంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు వికసిత భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 విజన్‌లను ప్రకటించారు. ప్రైవేటీకరణ ద్వారానే ఇవి సాధ్యమని, ఆ మార్గాన్ని ఎంచుకున్నారు. 2014-19లో కూడా ఈ మార్గమే అనుసరించారు. సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ అనే నినాదం ఎత్తుకున్నారు. అది కాస్తా ఎన్నికల దగ్గర బోల్తా పడి 'సన్ సెట్'గా మారింది. దాని కొనసాగింపే వివిధ రంగాలకు చెందిన 12 పాలసీలు. ఈ స్వర్ణాంధ్ర, పి-4. ఈ పాలసీల అమలులో భాగంగానే ప్రభుత్వ ఆసుపత్రులు, స్కూళ్ల ఆధునీకరణ, నిర్వహణ, తాగునీరు, పారిశుధ్యం, వ్యర్థాలు, వీధిలైట్ల నిర్వహణను ప్రైవేటు వారికి, కార్పొరేట్లకు, ఎన్‌జిఓలకు అప్పగించాలనుకోవడం. తొలి విడతలో 18 రోడ్లు (1307 కి.మీ), మలి దశలో పంచాయితీ రోడ్లను సైతం అభివృద్ధి చేసి, టోల్ వసూలు చేయాలనుకుంటున్నది. వీటిపై ప్రజల నుండి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో పి-4 అంటే పేదరిక నిర్మూలన, జీరో పోవర్టీ అని నమ్మించేందుకే పేదల దత్తత పేరుతో ఈ కొత్త నాటకం మొదలెట్టింది.కేంద్ర ఆర్థిక సర్వే ప్రకారం పేదరికంలో మన రాష్ట్రం దేశంలో తొమ్మిదవ స్థానంలో ఉంది. రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న కుటుంబాల సంఖ్య 1.48 కోట్లు. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన పేద కుటుంబాలు 90 లక్షలు. వీరంతా పేదలే అని ప్రభుత్వం కార్డులు ఇచ్చింది. పి-4 కింద వీరిందరిని పేదరికం నుండి బయటపడేయాలి. కాని అది సాధ్యం కాదని ప్రభుత్వానికి తెలుసు. అందుకే పేదరికం కుదింపు ప్రక్రియను ఉగాది రోజున ప్రారంభించింది. సచివాలయాల వారీగా తెల్ల రేషన్ కార్డుదారుల వివరాలు పంపి పేదలను గుర్తించమంది. తాగునీటి సౌకర్యం, విద్యుత్, బ్యాంకు అకౌంట్ ఉందా? వంటకు గ్యాస్ వాడుతున్నారా? కట్టెలా? కుటుంబంలో సంపాదిస్తున్నవారు ఉన్నారా? వంటి ప్రశ్నలతో పేదలను కుదించమని ఉద్యోగులను ఆదేశించింది. గ్యాస్, కరెంట్, బ్యాంక్ అకౌంట్ లేని కుటుంబాలు ఉండవు. వీటి ఆధారంగా పేదలు 19.15 లక్షలకు కుదించబడ్డారు. మార్గదర్శకులు (దత్తత) దొరకకపోతే పేదల సంఖ్య ఇంకా తగ్గుతూనే ఉంటుందేమో!

పేదరిక నిర్మూలన నుండి తప్పుకోవడమే

ఈ మాత్రపు పేదలను కూడా పేదరికం నుండి బయటపడేసే పని ప్రభుత్వానిది కాదట! పేదలకు బంగారు కుటుంబాలుగా నామకరణం చేసింది. అదే ఏరియాలో ఆర్థికంగా ఉన్న వారిని మార్గదర్శి కుటుంబాలుగా గుర్తించింది. మార్గదర్శి కుటుంబాలు రెండు రకాలుగా పేదలకు సహాయం చేయవచ్చు. 1. మార్గదర్శకత్వం చేయడం, కొంత ఆర్థిక సహాయం చేయడం. 2. ఆర్థిక సహాయం మాత్రమే చేయడమట. మార్గదర్శి కుటుంబాలు దానం చేస్తే వారి సహాయంతో వీరు పేదరికం నుండి బయట పడాలి. పడకపోతే ఆ లోపం పేద బంగారు కుటుంబానిది. ఇక తప్పు ప్రభుత్వానిది కాదు. ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకొని పారిపోతున్నది. పైగా ఆర్థిక సహాయం చేయడాన్ని దానంగా చూడకండంటూ ఉచిత సలహా ఇస్తోంది.

దత్తతకు ముందుకు రారే

కార్పొరేట్ ట్యాక్స్ చెల్లిస్తున్నవారు అధికంగా ఉన్న విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి లాంటి కార్పొరేషన్లలోనే పేదలను దత్తత తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. రాయితీలు పొందుతున్న శ్రీమంతులు సైతం సిద్ధపడడం లేదు. దీంతో సచివాలయ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, ఉద్యాన, వ్యవసాయ శాఖ ద్వారా ఆదర్శ రైతులకు ఆ బాధ్యతను అప్పగించారు. చిరుద్యోగులకు పేదరిక నిర్మూలన బాధ్యత అప్పగించడం సరికాదు.

ప్రభుత్వ రాయితీలు పొందుతున్న, రూ. కోటి ఆపైన ఆదాయం కలిగిన 1,362 మంది కోటీశ్వరులు ఎంత మందిని దత్తత తీసుకున్నారు? జివికె, ఎన్‌సిసి, హైటెక్ ఇన్‌ఫ్రా, రెడ్డీస్, అరోక్ష, ఎన్‌టిపిసి వంటి కార్పొరేట్ సంస్థలు ముందుకు వచ్చాయా? కనీసం సిఎస్ఆర్ నిధులు వెచ్చించే సంస్థలు కూడా పేదలను దత్తత తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. ఒకవేళ దత్తత తీసుకుని ఆర్థిక సహాయం అందిస్తే ఎంత చేయాలి? ఎన్ని సంవత్సరాలు చేయాలి? ఒక స్పష్టత లేదు. ఇలా చేస్తే శాశ్వతంగా ఆధారపడేవారిగా మారతారు తప్ప, పేదరికం నుండి బయటపడలేరు.

జీరో పోవర్టీ కావాలంటే

%వికసిత భారత్, స్వర్ణాంధ్ర-2047 వంటి విజన్‌లు ప్రకటించినంత మాత్రాన పేదరిక నిర్మూలన సాధ్యం కాదు. దత్తత పరిష్కారం అసలే కాదు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం మాదిరిగానే పట్టణ ఉపాధికి సంబంధించి కూడా ఒక చట్టం తీసుకువచ్చి ఉపాధి కల్పించాలి. షాపింగ్ మాల్స్, ప్రైవేటు విద్యాసంస్థల వంటి చోట్ల ఐదారు వేల రూపాయలకే పని చేసే సిబ్బందికి, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు రూ.21 వేలకు తగ్గకుండా ఇవ్వాలి. కార్పొరేట్లకు రూ.లక్షల కోట్ల రాయితీలు ఇచ్చేకన్నా ప్రభుత్వమే పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించవచ్చు.ప్రభుత్వం నుండి రాయితీలు పొందుతున్న కార్పొరేట్ సంస్థలు, పెద్ద పెద్ద వ్యాపారస్తులకు పేద కుటుంబాలలో ఉపాధి కల్పనకు కోటాలు ఇవ్వాలి. అమెరికా, బ్రెజిల్ మాదిరిగానే నిరుద్యోగులకు ఉపాధి కల్పించేవరకూ ఆర్థిక సహకారం అందించాలి. అలాగే పరిశ్రమలు, ఐ.టి సెక్టార్లలో పని గంటలు కుదించాలి. తద్వారా ఎక్కువ మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించవచ్చు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల ప్రకారం మిగులు భూమి, ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి!

# అక్రమ ఆక్రమణలతో వరద విపత్తు



అమరావతి,భారీ వర్షాలతో రెండు తెలుగు రాష్ట్రాలు మళ్లీ విపత్తును ఎదుర్కొంటున్నాయి. ఏడాది క్రితం నాటి వరద బీభత్సం మళ్లీ ఇప్పుడు కనిపిస్తోంది. గత ఏడాది సెప్టెంబరు 1న మున్నేరు వరదవిలయంతో ఖమ్మం జిల్లా కేంద్రం ఛిన్నాభిన్నం కాగా, ఇప్పుడు అదే మున్నేరులో వరద నీరు పెరుగుతోంది. ప్రస్తుతం మున్నేరులో పది అడుగుల వద్ద నీరుంది. గత ఏడాది మున్నేరుకు వరదలు వచ్చి ఖమ్మం నగరం జలమయం అయింది. కృష్ణానదికి ఉపనది అయిన మున్నేరుకు రిటైనింగ్ వాల్ నిర్మించకపోవడం, వరద పరిస్థితిపై ప్రజలను అప్రమత్తం చేయకపోవడం జలప్రళయానికి దారితీసిందని చెబుతున్నారు. మున్నేరుకు సమీపంలోని మొత్తం 25 కాలనీల్లో ఇళ్లల్లో 10 అడుగుల ఎత్తులో నీరు చేరింది.గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మున్నేరు వాగు కట్టకు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ. 100 కోట్లు మంజురైనా అధికారుల అలసత్వం వల్ల ఆ పనులు పూర్తి కాలేదు. ఆ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని మున్నేరు వాగు ఉప్పొంగడానికి దారితీసే ఆకేరు వాగు ఎగువనున్న చెరువులను ఎప్పటికప్పుడు పరిశీలించి వరద పరిస్థితిని ముందుగా పసికట్టగలిగితేనే ముప్పు తప్పుతుందని చెబుతున్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో గత ఏడాది బుడమేరుకు వరదలు వచ్చాయి. బుడమేరు ప్రవాహం సజావుగా ఉప్పుటేరు మీదుగా సముద్రంలోకి వెళ్లే అవకాశం లేకపోవడంతో కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలు ప్రమాదం అంచున నిలుస్తున్నాయి. 2005లో బుడమేరు ఉగ్రరూపం దాల్చి కొల్లేరులోకి చేరడంతో దాదాపు 44 లంక గ్రామాలు విపత్తుతో అల్లాడాయి. అప్పట్లో వారం రోజులపాటు విజయవాడ నగరం ముంపులో ఉండిపోయింది.ఆంధ్రప్రదేశ్‌లో గత రెండు మూడు రోజులుగా భారీ వర్షాలకు నదుల్లో వరద నీరు ఉప్పొంగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రకాశం బ్యారేజికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. బుధవారం ఉదయానికి 2 లక్షల క్యూసెక్కుల నీరు చేరింది. బ్యారేజి గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడగులు కాగా, ప్రస్తుత నీటి మట్టం 589.20 అడుగులుగా నమోదైంది. దీంతో ప్రాజెక్టులో 26 గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్నారు. ఈ పరిస్థితులన్నిటికీ ముఖ్య కారణం అక్రమ ఆక్రమణలు. నదీ ప్రవాహం ముందుకు సాగకుండా నిర్మాణాలు వెలుస్తుండటంతో భారీ వర్షాలు కురిసేటప్పుడు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.దేశంలోని ఇతర రాష్ట్రాల పరిస్థితి కూడా ఇలాగే ఉంటోంది. దేశ వ్యాప్తంగా 1953 నుంచి 2018 మధ్యకాలంలో వరదల కారణంగా రూ. 4 లక్షల కోట్ల ఆస్తినష్టంతోపాటు లక్షమందికి పైగా ప్రాణాలు కోల్పోయారని నివేదికలు చెబుతున్నాయి. దేశంలో నాలుగు కోట్ల హెక్టార్ల భూమికి వరదల ముప్పు పొంచిఉందని జాతీయ వరదల సంఘం 1980 లోనే హెచ్చరించింది. ఈ మేరకు వరదలను ఎదుర్కోడానికి 207 సిఫార్సులు చేసింది. కానీ ఇంతవరకు ఎలాంటి ప్రణాళికలు చేపట్టలేదు. ముంబై, చెన్నై వంటి నగరాలు ఏటా భారీ వర్షాలకు తెప్పలుగా తేలిపోతున్నాయి. చెన్నైలో 1943, 1976, 1985, 1998, 2002, 2005, 2015లో భారీ వర్షాలతో వరదలు ముంచెత్తాయి. 2015లో చెన్నై సబర్బన్ ప్రాంతాల్లో 432 మంది ప్రాణాలు కోల్పోగా, 3.04 మిలియన్ మంది వరద బాధితులయ్యారు. మొత్తం రూ. 25,913 కోట్ల వరకు నష్టం వచ్చింది.వరదల కారణంగానే 1953 2017 మధ్య కాలంలో తమిళనాడులో రూ. 27,326 కోట్ల వరకు నష్టం ఏర్పడింది. ఈ మధ్యకాలంలో 3705 మంది ప్రాణాలు కోల్పోయారు. ముంబై, అహ్మదాబాద్, కోల్‌కతా, బెంగళూరు, సూరత్ తదితర నగరాలు పదేపదే భారీ వర్షాలతో వచ్చిన వరదలకు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఈ విపరీతాలకు మూల కారణం జలవనరులు ఆక్రమణలతో హరించుకుపోవడమే. అహ్మదాబాద్‌లో కొన్నేళ్ల క్రితం 190 చదరపు కిలోమీటర్ల పరిధిలో 603 చెరువులు ఉండగా, 2001 నాటికి ఆ సంఖ్య 137కు పడిపోయింది. హైదరాబాద్ నగరంలో ఒకప్పుడు వేల చెరువులుండేవి. కానీ రానురాను అవి హరించుకుపోయాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 134 సరస్సులు ఆక్రమణల పాలైనట్టు గుర్తించారు.ఈ సరస్సులు చుట్టూ 14,061 ఆక్రమణలు బయటపడ్డాయి. మొత్తం ఆక్రమణల్లో 85 శాతం కేవలం 30 నీటివనరుల్లోనే గుర్తించగా, 15 శాతం 104 సరస్సుల చుట్టూ ఉన్నట్టు కనుగొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక తెలంగాణలో హైడ్రా సంస్థ ఏర్పాటుతో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపడం ప్రారంభమైంది. ప్రభుత్వ భూములు, చెరువుల కట్టడాలు, ఎఫ్‌టిఎల్ (ఫ్లడ్‌లెవెల్) జోన్‌లలోని అక్రమ కట్టడాలని కూల్చివేస్తోంది. అయినా ఇంకా చేపట్టవలసిన చర్యలు చాలా ఉన్నాయి. దేశంలో నగరాలు అత్యంత ఆధునికీకరణకు నోచుకుని మరింత విస్తరించడం మంచిదే అయినా దానికి తగ్గట్టు మౌలిక సౌకర్యాల విస్తరణ చేపట్టడం కూడా అంతే ముఖ్యం.వరదలువంటి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా నగరాలను హెచ్చరికల వ్యవస్థలతో చక్కగా తీర్చిదిద్దాలి. సమస్యలన్నిటికీ మూలకారణమవుతున్న అక్రమ నిర్మాణాలను నివారించగలగాలి. దీనికి ప్రజలనుంచి కూడా సహకారం అవసరం. కొంతమంది అక్రమార్కులు కోర్టులను ఆశ్రయించి అక్రమ నిర్మాణాల తొలగింపును అడ్డుకోవడం మనం చూస్తున్నాం. హైదరాబాద్ లోని హైడ్రా చేపట్టే అక్రమ నిర్మాణాల తొలగింపునకు ఇలాంటి ఉదంతాలే ఆటంకం కల్పిస్తున్నాయి. ఇదిలా ఉండగా భారీ వర్షాల వల్ల ముంచుకొచ్చిన వరద నీటిని క్రమబద్ధీకరించి, నిల్వ చేసుకునే ఏర్పాట్లు లోపించడమే నగరాలు వరద విపత్తుకు బలవుతున్నాయి.

# శ్రామిక గమనశీలతతోనే ఎక్కువ ఉపాధి

న్యూఢిల్లీ,ఆర్థిక పరిభాషలో శ్రామిక గమనశీలత (అంటే కార్మికులు వివిధ ఉద్యోగాలు లేదా విభిన్న భౌగోళిక స్థానాల మధ్య సులభంగా వెళ్ళగలగడం. ఈ కీలకమైన భావన ఆర్థిక వ్యవస్థలో శ్రమవనరులు ఎంత సమర్థవంతంగా కేటాయించబడుతున్నాయో తెలపడంతోపాటు, ఉత్పాదకత, ఆర్థికవృద్ధి వంటి అంశాలను ప్రభావితం చేస్తుంది. విద్య, శిక్షణ, సామాజిక, కుటుంబ సంబంధాలు, గృహ ఖర్చుల లభ్యత, ప్రభుత్వ విధానాలు మొదలైన అనేక అంశాలు శ్రామిక గమనశీలతను ప్రభావితం చేస్తాయి. తక్కువ శ్రామిక గమనశీలత కొన్ని ప్రాంతాలలో నిరంతర నిరుద్యోగం, ఇతర ప్రాంతాలలో కార్మిక కొరతలకు దారితీస్తుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) 2024 అంచనాల ప్రకారం, 2022లో ప్రపంచవ్యాప్తంగా 167.7 మిలియన్ల అంతర్జాతీయ వలస కార్మికులు ఉన్నారు.వారు ప్రపంచ శ్రామికశక్తిలో 4.7%. ప్రపంచ అంతర్జాతీయ వలస జనాభాలో 15 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సు గల కార్మికులు దాదాపు (%ఔశీతీనివతీం ఖతీవ ఖజూజూతీశిఇ%) 66% ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా వృత్తిపరమైన గమనశీలతను ప్రభావితంచేసే అంశాలు చూసినప్పుడు నైపుణ్యాలు, విద్య, వేతన వ్యత్యాసాలు, శిక్షణ అవకాశాలు, బదిలీ నైపుణ్యాలు, వృత్తిపరమైన నిబంధనలు, పని వాతావరణాలకు అనుగుణంగా ఉండే సామర్థ్యం మొదలైనవి. మరోవైపు భౌగోళిక గమనశీలతను వేతన వ్యత్యాసాలు, జీవన వ్యయం, గృహనిర్మాణం, మార్కెట్, సామాజిక, సాంస్కృతిక సంబంధాలు, ప్రభుత్వ విధానాలు, రాజకీయ స్థిరత్వం, పౌరస్వేచ్ఛలు, వాతావరణం, ప్రకృతి వైపరీత్యాలు, సాంకేతిక పురోగతి మొదలైనవి ప్రభావితం చేస్తాయి.విజువల్ క్యాపిటలిస్ట్ ప్రచురించిన డేటా ప్రకారం ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో అంతర్జాతీయ వలసదారులు అమెరికాలో 52.4 మిలియన్లకు పైగా ఉన్నారు. దీని వలన అది అధిక గమనశీలత కలిగిన దేశంగా మారింది. మెక్సికో, -అమెరికా వలస కారిడార్ ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉంది. మెక్సికోలో జన్మించిన 10 మిలియన్లకు పైగా ప్రజలు మైగ్రేషన్ డేటా పోర్టల్ ప్రకారం అమెరికాలో నివసిస్తున్నారు. యునైటెడ్ కింగ్‌డమ్ కూడా వలస కార్మికుల రాకపోకలలో గణనీయమైన పెరుగుదలను చూసింది. 2023లో 2,83,000 మంది వలస కార్మికులు వచ్చారు. ఇది మునుపటి సంవత్సరం కంటే 48% ఎక్కువ. కెనడా కూడా అధిక స్థాయిలో శ్రామిక గమనశీలత అనుభవిస్తోంది, 2023లో 1,45,000 మంది వలస కార్మికులు వచ్చారు, ఇది 7% ఎక్కువ. ఇతర ముఖ్యమైన దేశాలు జర్మనీ, జపాన్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా కూడా వలస కార్మికులను ఆకర్షించడంలో బలమైన ధోరణులను చూపిస్తున్నాయి.వాస్తవానికి, పోటీతత్వ ప్రపంచ శ్రామికశక్తికి కార్మిక మార్కెట్ సరళత చాలా అవసరం. ఎందుకంటే ఇది ఉద్యోగ సృష్టిని ప్రోత్సహిస్తుంది. విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తుంది. శ్రామిక శక్తి గమనశీలతను పెంచుతుంది. కార్మిక సంస్కరణలను అమలు చేసిన దేశాలు ఆర్థిక వృద్ధిలో గణనీయమైన మెరుగుదలను చూపిస్తున్నాయి. సౌకర్యవంతమైన కార్మిక విధానాలను కలిగి ఉన్న దేశాలు మార్కెట్ డిమాండ్లకు బాగా సర్దుబాటు చేయగలవు, మాంద్యాలను తగ్గించగలవు. మరింత స్థితిస్థాపక ఆర్థిక వ్యవస్థను పెంపొందించగలవు. పైగా ఈ దేశాలు వేగవంతమైన నియామకం, మెరుగైన పోటీతత్వం, సాంస్కృతిక నిరోధకత, ఆర్థికవృద్ధి, ఉద్యోగసృష్టి వంటి ప్రయోజనాలను కూడా కలిగి ఉన్నాయి. 2025లో ఉద్యోగ సౌలభ్యం, ఉపాధి ఒప్పందాలు, వేతన సరళత ఆధారంగా, మొదటి ఐదు దేశాలు 96/100 స్కోరుతో డెన్మార్క్, 95/100 స్కోరుతో సింగపూర్, 94/100 స్కోరుతో యునైటెడ్ స్టేట్స్, 92/100 స్కోరుతో న్యూజిలాండ్, 80/100 స్కోరుతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ). కార్మిక మార్కెట్ సరళత విషయానికి వస్తే ఈ దేశాలు ముందున్నాయి.ఐక్యరాజ్య సమితి (యుఎన్‌ఓ) వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్టస్ 2024 డేటా ఆధారంగా, 2023లో అత్యధిక నికర వలస రేట్లు కలిగిన మొదటి ఐదు దేశాలు, పాకిస్తాన్ -1.62 మిలియన్లు, సూడాన్ -1.35 మిలియన్లు, భారతదేశం -979,000, చైనా 568,000



బంగ్లాదేశ్ 550,000. అనేక దేశాలు తమ పౌరులు ఇతర దేశాలకు వలస వెళ్లడం వల్ల స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)లో తగ్గుదలని ఎదుర్కొంటున్నాయి. వీటిలో భారతదేశం, చైనా ఎక్కువ జనాభాను కలిగి ప్రభావితమయ్యాయి. ఈ దేశాల పౌరులు గణనీయమైన సంఖ్యలో వలస వెళ్తున్నారు, దీని వలన సమర్థ శ్రామిక శక్తి, మానవ మూలధనం కోల్పోతున్నారు. భారతదేశంలో భౌగోళిక (ప్రాంతాల వారీగా గమనశీలత), వృత్తిపరమైన (ఉద్యోగాలు/ వృత్తుల వారీగా గమనశీలత) రెండూ సాంప్రదాయకంగా చాలా తక్కువగా ఉన్నాయి.అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే ప్రధాన కారణాలు కులవ్యవస్థ, కుటుంబ, సమాజ బంధాలు, భాష, ప్రాంతీయ తేడాలు వంటి సామాజిక, సాంస్కృతిక అంశాలు, తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, వలస ఖర్చు వంటి ఆర్థిక పరిమితులు ఉన్నాయి. దీనికి అదనంగా పట్టణ గృహనిర్మాణం, పట్టణ మురికివాడ పరిస్థితులు, విద్య, నైపుణ్య అడ్డంకులు, నైపుణ్య అసమతుల్యత మొదలైనవి భారతదేశంలో కార్మికుల గమనశీలతను ప్రభావితం చేస్తున్నాయి. అశోక విశ్వవిద్యాలయం స్టాటిస్టా డేటా ప్రకారం, హిమాచల్‌ప్రదేశ్ జనాభాలో 45.7% వలసదారులతో ముందంజలో ఉంది. ఇతర ప్రముఖ రాష్ట్రాలు కేరళ %-% 38.4%, తెలంగాణ %-% 37.1%, పంజాబ్ %-% 35.8%, మహారాష్ట్ర %-% 35.6% వలస జనాభాతో ఉన్నాయి.ప్రత్యేకంగా ఉపాధి కోసం కదలికను కొలిస్తే, కొన్ని చిన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు అధిక శాతాన్ని చూపిస్తున్నాయి, అవి అరుణాచల్ ప్రదేశ్ నుండి 31.2% వలసదారులు పని కోసం తరలివెళుతున్నారు, మిజోరం %-% 30.3%, ఢిల్లీ %-% 28.6%, నాగాలాండ్ 27.5%. వలస కార్మికుల కోసం ప్రధాన గమ్యస్థాన రాష్ట్రాలను చూసినప్పుడు మహారాష్ట్ర 7.9 మిలియన్ల అంతర్ రాష్ట్ర వలస కార్మికులను కలిగి ఉంది, తమిళనాడు 3.48 మిలియన్ల మంది కార్మికులు కర్ణాటక 2.88 మిలియన్లు గుజరాత్ 3 మిలియన్లు. ఢిల్లీ 2.03 మిలియన్లు, కేరళ 0.7 మిలియన్లకుపైగా అంతర్‌రాష్ట్ర వలస కార్మికులను కలిగి ఉంది. భారతదేశంలో మరిన్ని ఉపాధి అవకాశాల కోసం కార్మిక గమనశీలతను పెంచడానికి చర్యలు తీసుకోవాలి. కార్మికుల గమనశీలతను పెంచడం నిరుద్యోగ భారాన్ని తగ్గిస్తుంది కాబట్టి కార్మికుల గమనశీలతపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి.

## బేగంబజార్‌లో కుప్పకూలిన పురాతన భవనం

హైదరాబాద్,హైదరాబాద్‌లోని బేగంబజార్‌లో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఓ పురాతన భవనం కుప్పకూలింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ భవనం శిథిలావస్థకు చేరుకొందని, దాన్ని కూల్చేయాలని గతంలోనే జీహెచ్ఎంసీ అధికారులు ఆ భవనం యజమానికి నోటీసులు ఇచ్చినా పట్టించుకోలేదు. బేగంబజార్‌లో ఇలాంటి పురాతన భవనాల్లోనే వ్యాపారులు ఇప్పటికీ దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ రద్దీ ఎక్కువగా ఉండటంతో శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటివాటిపై బల్దియా అధికారులు కేవలం నోటీ-సులు ఇచ్చి వదిలేయడమే కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# వాయువ్య దిశగా పయనించే అవకాశం

విశాఖపట్నం,బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోందని వాతావరణ శాఖ అధికారి వెల్లడించారు. శుక్రవారం ఇది మరింత బలపడి సుస్పష్ట అల్ప పీడనంగా మారే అవకాశం ఉందన్నారు. గురువారం విశాఖపట్నంలో విలేకర్లతో మాట్లాడుతూ.. పశ్చిమ మధ్య వాయువ్య బంగాళాఖాతంలో ఈ అల్పపీడనం కొనసాగుతోందన్నారు. ఇది పశ్చిమ వాయువ్య దిశగా ఉత్తరాంధ్ర – ఒడిశా వైపు కదిలే అవకాశం ఉందని తెలిపారు. రాగల వారం రోజుల పాటు– రాష్ట్రంలో చెదురుమదురు వర్షాలు పడే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. రానున్న 24 గంటల్లో రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు ఒకటి రెండు చోట్ల పడవచ్చని చెప్పారు. ఈ నేపథ్యంలో సముద్ర తీరం వెంబడి 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్నారు. దీంతో సముద్రంలో వేటకు వెళ్ల వద్దని మత్స్యకారులకు ఆయన సూచించారు. కళింగపట్నం, భీమునిపట్నం, విశాఖపట్నం, మచిలీపట్నం, గంగవరం, కాకినాడ ఓడరేవుల్లో మూడో నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశామని వివరించారు. విజయవాడలోని ప్రకాశం బ్యారేజి వద్ద వరద నీరు పెరుగుతోంది. ప్రస్తుత ఇన్, ఔట్ ఎ÷-లో 5,52,640 క్యూసెక్కులుగా ఉంది. మరి కాసేపట్లో 2వ ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని సమాచారం. అయితే కృష్ణానదికి వరద పోటు– ఎత్తడంతో.. ఆ నది పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచించింది. ఏ సమయంలోనైనా.. అత్యవసర సహాయం కోసం 112, 1070 నెంబర్లను సంప్రదించాలని కోరింది. ఇక కృష్ణానదిలో ప్రయాణించడం కానీ.. ఈతకు వెళ్ళడం.. చేపలు పట్టడం వంటి పనులు చేయవద్దని ప్రజలకు వివరించింది. ఈ మేరకు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

# నిజమేనా ?

న్యూఢిల్లీ,జాతీయ రాజకీయాల్లో చాలా చోటు చేసుకుంటున్నాయి. బీజేపీ నాయకత్వంలో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం పాలన సాగిస్తోంది. మోడీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ అండ్ కో ఇండియా కూటమిగా స్ట్రాంగ్ అపొజిషన్ గా ఉన్నారు. 2024 ఎన్నికల తరువాత వచ్చిన మార్పు ఏమిటి అంటే లీడర్ ఆఫ్ అపోజిషన్ హోదాలో రాహుల్ ఉన్నారు. గతం కంటే ఎక్కువగా ఇండియా కూటమి సీట్లు పెరిగాయి. అదే సమయంలో బీజేపీకి సొంతంగా బలం లేదు, సింపుల్ మెజారిటీకి చాలా దూరంలో ఆ పార్టీ ఉంది. మిత్రుల సాయంతో కేంద్ర ప్రభుత్వం నడుస్తోంది. గట్టిగా పదునాలుగు నెలలు కాలేదు కానీ మోడీ ప్రభుత్వాన్ని రాహుల్ అండ్ కో దూకుడుగానే సవాల్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ స్థాయిలో ఎపుడు ఏమి జరుగుతుందో అన్న చర్చ అయితే ఉంది.

బాంబు పేల్చిన జగన్ :

జాతీయ రాజకీయాలలో చూస్తే ఎన్డీయే కూటమి ఇండియా కూటమి రెండే ఉన్నాయి. ఈ రెండింటిలోనే దేశంలోని నూటికి తొంబై శాతం పార్టీలు చేరిపోయాయి. పది శాతం పార్టీలు మాత్రం తటస్థంగా ఉన్నాయి. అయితే ఏపీ నుంచి చూస్తే టీడీపీ ఎన్డీయే కూటమిలో ఉంది. మోడీ ఈజ్ గ్రేట్ అని రోజుకు ఒకసారి అయినా చాలా గట్టిగా చంద్రబాబు చెబుతున్నారు. బీజేపీతో పొత్తు కోసం టీడీపీ ఎంత తీవ్రంగా ప్రయత్నం చేసి 2024 ఎన్నికల్లో జత కలిసిందో అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీతో చంద్రబాబు టచ్ లో ఉన్నారు అని వైసీపీ అధినేత జగన్ బాంబు పేల్చారు.

ఆయన ద్వారానట :

తెలంగాణా లో కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి ద్వారా చంద్రబాబు రాహుల్ గాంధీకి టచ్ లో ఉన్నారు అని జగన్ ఆరోపించారు. ఇక రేవంత్ రెడ్డి గతంలో టీడీపీలో ఎంత కీలకంగా ఉండేవారో తెలిసిందే. ఆయన చంద్రబాబుకు అత్యంత సన్నిహితంగా మెలిగిన వారుగా ఉన్నారు. ఇక రేవంత్ రెడ్డితో ఈ రోజుకీ చంద్రబాబుకు మంచి సంబంధాలే ఉన్నాయని బీఆర్ ఎస్ నాయకులు ఆరోపిస్తూ ఉంటారు. ఇక ఏపీలో చూస్తే జగన్ కూడా అదే నమ్ముతారు. ఇపుడు ఆయన దీనికి మరికాస్త పెంచి బాబు రాహుల్ గాంధీకి టచ్ లో ఉంటున్నది నిజం అంటున్నారు. రేవంత్ రెడ్డి ద్వారా ఇదంతా జరుగుతోంది అని చెబుతున్నారు.

కొత్త విషయం అయితే కాదుగా :

అయితే తెలుగుదేశం కాంగ్రెస్ కలవడం అన్నది కొత్త విషయం ఏమీ కాదని అంతా అంటారు. 2018లో తెలంగాణాలో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం కాంగ్రెస్ కలసి పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాలేదు. కాంగ్రెస్ లో ఉన్న రేవంత్ రెడ్డి ద్వారానే ఈ పొత్తు సాధ్యపడింది అంటారు. ఇక దీనికంటే ముందు బెంగళూరులో కాంగ్రెస్ మిత్రుల ప్రభుత్వం ఏర్పాటు కోసం కాంగ్రెస్ దాని సన్నిహిత పార్టీలతో కలసి బాబు కనిపించారు. ఆ తరువాత తెలంగాణాలో కూడా పొత్తు ఖరారు అయింది. అందువల్ల రాజకీయంగా ఏమైనా జరగవచ్చు అన్న వారూ ఉన్నారు.

జగన్ సూటి ప్రశ్న :

ఏపీలో ఓట్ల చోరీ మీద రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడరు అని జగన్ సూటిగా ప్రశ్నించారు. ఎందుకు మాట్లాడరు అంటే చంద్రబాబుతో హాట్ లైన్ లో టచ్ లో ఉన్నారు కాబట్టి అని ఆయన అసలు విషయం ఇదే అంటున్నారు. ఇక ఏపీలో 2024 ఎన్నికలలో పోలింగ్ ముగిసేనాటికి కౌంటింగ్ నాటికి 12.5 పెరిగాయి. అంటే 48 లక్షల ఓట్లు ఒకేసారి పెరిగాయని ఆయన చెప్పారు. మరి ఇంత పెద్ద ఎత్తున ఓట్ల చోరీ ఏపీలో జరిగితే రాహుల్ గాంధీ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు.అంతే కాదు ఏపీ కాంగ్రెస్ ఇంచార్జి మాణికం ఠాగూర్ కూడా ఏపీ వ్యవహారాల మీద నోరెత్తరని అమరావతిలో జరుగుతున్న అవినీతి మీద కూడా మౌనంగా ఉంటారని జగన్ విమర్శించారు. మొత్తం మీద చంద్రబాబు రాహుల్ మధ్య కొత్తగా మరోసారి బంధం పెనవేసుకుంటోంది అని జగన్ చెప్పిన వార్త జాతీయ రాజకీయాల్లో అతి పెద్ద చర్చకు దారి తీసే అవకాశం ఉంది. అంతే కాదు బీజేపీ శిబిరంలో కూడా వేడి పుట్టించే చాన్స్ ఉంది అని అంటున్నారు.

## నల్లగొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు

నల్గొండ,నల్గొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. మైనర్ బాలికపై అత్యాచారం చేసి, ఆపై హత్య చేసిన నిందుతుడికి ఉరిశిక్ష విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. పోక్సో, హత్య కేసులో నిందుతుడికి ఉరిశిక్ష విధించింది. అంతేకాదు జరిమానాగా లక్షా పది వేల రూపాయలు కట్టాలని ఆదేశించింది. నిందుతుడికి ఉరిశిక్ష విధించిన నల్గొండ కోర్టుపై బాధిత కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ కూతురికి ఇన్నాళ్లకు న్యాయం జరిగిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.2013లో మొహమ్మి ముక్రమ్ అనే వ్యక్తి 12 ఏళ్ల మైనర్ బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక ఇంట్లో ఒంటరిగా ఉండటం చూసి అత్యాచారం చేశాడు. అనంతరం మైనర్ బాలికను హత్య చేశాడు. హత్య అనంతరం మృతదేహాన్ని నాలాలో పడేశాడు. మూడు రోజుల తర్వాత పోలీసులు బాలిక మృతదేహాన్ని గుర్తించారు. నిందితుడిపై నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది.

## వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

హైదరాబాద్, వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో భారీ వర్షాలు, సహాయక చర్యలపై ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షలో సీఎస్ రామకృష్ణారావు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు రూ.కోటి విడుదల చేస్తున్నట్లు- తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బందిని వెనక్కి పిలిపించాలని కోరారు. వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. వచ్చే 3 రోజుల్లో భారీ వర్షాల దృష్ట్యా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వివిధ జిల్లాల్లోని పరిస్థితి గురించి కలెక్టర్లను మంత్రి పొంగులేటి అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీలో మున్సిపల్, ట్రాఫిక్ విభాగాలు, మెట్రో వాటర్ బోర్డు సమన్వయంతో పని చేయాలన్నారు. మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు రెడ్ జోన్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. మిగతా అన్ని జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.

## టారిఫ్‌ల తుపాన్

వాషింగ్టన్:,బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అనేక ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారు. ఈ సమయంలోనే అమెరికా ప్రారంభించిన ట్రేడ్ వార్ ప్రభావం కూడా పెరిగింది. టారిఫ్‌ల తుపాన్ దేశంలోని పలు రంగాలను తీవ్రంగా దెబ్బ తీస్తోందన్న వార్తలు వస్తున్నాయి. మన దేశ ఎగుమతులపై 25నుండి 50శాతం వరకు భారీగా పెంచిన సుంకాలు దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్ద దెబ్బకొడుతున్నాయన్నది ఈ వార్తల సారాంశం. అధిక సుంకాలు సీ-ఫుడ్, టెక్స్‌టైల్స్, రత్నాలు, యంత్రాలు వాటి విభాగాలపై ప్రభావం చూపుతున్నాయి. దేశీయ ఎగుమతిదారులు ఒక్క రోజులోనే గణనీయమైన పతనాన్ని చూడాల్సిరావడం ఆందోళనకలిగిస్తోంది. అమెరికా మార్కెట్‌పై అధికంగా ఆధారపడిన వారికి 30 నుండి 40 శాతం మేర ఆర్డర్లు తగ్గినట్లు, దాదాపు ఆ స్థాయిలోనే ఆదాయంలో కూడా తగ్గుదల నమోదైనట్లు ఆర్థిక నిపుణుల అంచనా! దేశ వ్యాప్తంగా మారుమాల ప్రాంతాలకు సైతం ఆన్‌లైన్ వ్యాపారాన్ని విస్తరించి, లాభాలు పోగుచేసుకుంటున్న అమెజాన్ సంస్థ కొత్త ఆర్డర్లను నిలిపివేసింది. మరో దిగ్గజ సంస్థ వాల్‌మార్ట్ కూడా అదేబాటన నడిచింది. వాటితో పాటు మరికొందరు అమెరికా కొనుగోలుదారులు కూడా వియత్నాం, బంగ్లాదేశ్, ఈక్వెడార్ వంటి తక్కువ టారిఫ్ కలిగిన దేశాలవైపు మళ్లిపోయారు. ఫలితంగా ఆర్డర్లలో భారీగా తగ్గుదల నమోదైంది. తొలి రెండురోజుల్లోనే 40 శాతం వరకు ఈ తగ్గుదల నమోదుకాగా, భవిష్యత్తులో ఇది 50 శాతం దాటుతుందని అంచనా! ఈ సంక్షోభ ప్రభావం మన రాష్ట్రంపై కూడా తీవ్రంగా పడుతోంది. దేశ వ్యాప్తంగా జరుగుతున్న సీ-ఫుడ్ ఎగుమతులలో మూడవ వంతు మన రాష్ట్రం నుంచే జరుగుతుండటం గమనార్హం. మన దేశం నుండి జరుగుతున్న సీ-ఫుడ్ ఎగుమతుల్లో అత్యధిక వాటా రొయ్యలదే కాగా, దానిలో ఆంధ్రప్రదేశ్ వాటా 60 శాతానికి పైగా ఉంటుందని అంచనా! రొయ్యల సాగుకు కీలకమైన హార్వెస్టింగ్ సీజన్ సాగుతున్న ప్రస్తుత సమయంలోనే ట్రంప్ విధించిన కొత్త సుంకాలు అమలులోకి వచ్చాయి. దీని ప్రభావం వెంటనే రైతులు, ఎగుమతిదారులపై పడింది. ఫామ్ గేటువద్దే 19శాతం ధర పడిపోయినట్లు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 6.5 లక్షల మంది రొయ్యల రైతుల మీద, ఆ రంగంపై ఆధారపడి పొట్టపోసుకుంటున్న మరో 30నుండి 40 లక్షల మందిపైనా దీని ప్రభావం తీవ్రంగా పడనుంది. ఆంధ్రప్రదేశ్ తరువాత ఒడిషా, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు ఈ రంగంలో తీవ్ర నష్టాలను ఎదుర్కుంటున్నాయి. ఉత్తర, మధ్య భారతంలోని అనేక రాష్ట్రాలు టెక్స్‌టైల్స్, యంత్రాల ఎగుమతులపై విధించిన టారిఫ్‌ల కారణంగా నష్టాలను ఎదుర్కుంటున్నాయి. ప్రధాన మంత్రి సొంత రాష్ట్రమైన గుజరాత్ నుండి పెద్ద ఎత్తున జరుగుతున్న టెక్స్‌టైల్స్ ఎగుమతులపై టారిఫ్‌లు తీవ్ర పభ్రావాన్ని చూపించాయి. అమెరికాతో జరిగే టెక్స్‌టైల్ వ్యాపారంలో గుజరాత్‌ది దాదాపు 35శాతం వాటా కాగా, ప్రస్తుతం యార్న్ నుండి ఫ్యాబ్రిక్ వరకు మొత్తం ఉత్పత్తులు నిలిచిపోయాయి. దీంతో లక్షలాది మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. అనేక చిన్న, మధ్యతరహా వ్యాపారాలు (ఎంఎస్ఎంఇలు) మూసివేత ముప్పును ఎదుర్కొంటున్నాయి.

ఇంత జరుగుతున్నా మోడీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేకపోవడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపి, దేశాన్ని పతనం దిశకు నెట్టకముందే కేంద్ర ప్రభుత్వం మేల్కోవాలి. తక్షణ, దీర్ఘకాల ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందించి, అమలు ప్రారంభించాలి. కార్పొరేట్ అనుకూల, ఉదారవాద విధానాల అమలు నేపథ్యంలో దేశ విదేశాంగ విధానాన్ని, ఆర్థిక వ్యవస్థను అమెరికాకు దూడూ బసవన్నగా మారిన పర్యవసానం ఇది. ఇప్పటికైనా అమెరికా చేస్తున్న వాణిజ్యయుద్ధాన్ని ఎదుర్కొనాలి. కేంద్ర ప్రభుత్వం సరైన వ్యూహంతో దాన్ని తిప్పికొట్టాలి. ఆక్వా, టెక్స్‌టైల్ తదితర రంగాలపై తీవ్ర ప్రభావం పడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వంపై తగిన ఒత్తిడి తేవడం టిడిపి కూటమి సర్కారు విద్యుక్త ధర్మం.

## కుప్పం లెక్క సరిచేసిన టీడీపీ !

పులివెందుల,:గత దశాబ్దకాలంగా ద్విముఖంగా సాగుతున్న ఏపీ రాజకీయాల్లో చంద్రబాబు, వైఎస్ జగన్ మధ్య హోరాహోరీ పోరు సాగుతూనే ఉంది. ఒకరిపై ఒకరు పైచేయి సాధించడానికి అందివచ్చిన ఏ చిన్న అవకాశాన్నీ వీరు వదులుకోవడం లేదు. ఇదే క్రమంలో గతంలో వైసీపీ హయాంలో కుప్పంలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీని ఓడించి చంద్రబాబును దెబ్బ తీశానని జబ్బలు చరుచుకున్న జగన్ కు ఇప్పుడు ఆయన సొంత గడ్డ పులివెందులలో జడ్పీటీసీ స్థానాన్ని డిపాజిట్ లేకుండా చేసి గెలిచి చంద్రబాబు ప్రతీకారం తీర్చుకున్నారు. 2019లో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక చంద్రబాబు టార్గెట్ గా జగన్ పావులు కదిపారు. ముఖ్యంగా చంద్రబాబు వరుసగా గెలుస్తున్న కుప్పం సీటులో లెక్కల్ని మార్చాలని టార్గెట్ పెట్టుకున్న జగన్.. అందుకు స్థానిక ఎన్నికల్ని పావుగా వాడుకున్నారు. 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లో ముందుగా పంచాయతీ పోరులో వైసీపీ ఘన విజయం సాధించి టీడీపీకి తొలి షాక్ ఇచ్చింది. అదే ఏడాది మున్సిపల్ ఎన్నికల్లోనూ గెలిచి ఇక చంద్రబాబును ఎమ్మెల్యేగా ఓడించడమే లక్ష్యంగా వైనాట్ కుప్పం అని ప్రకటించింది. అప్పట్లో చంద్రబాబు నియోజకవర్గం కుప్పం నియోజకవర్గంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో వైసీపీ 89 గ్రామ పంచాయతీలకు గానూ 74 చోట్ల విజయం సాధించింది. టీడీపీ 14 పంచాయతీల్లోనే గెలిచింది. ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికల్లో కుప్పంలోని మొత్తం 25 వార్డులకు గానూ వైసీపీ 18 వార్డులు గెలిచింది. ఆ ఎన్నికల్లో టీడీపీ 6 వార్డులతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే వైసీపీ ప్రభుత్వం స్థానంలో గతేడాది అధికారంలోకి వచ్చిన టీడీపీ.

# కొత్త కూటమితో అమెరికాకు చెక్



న్యూఢిల్లీ,ఈ ఏడాది ప్రారంభంలో ప్రధాని నరేంద్ర మోడీ డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక స్నేహితుడని, అమెరికాతో వాణిజ్య సుంకాల ఒప్పందాన్ని కుదుర్చుకునే మొదటి వ్యక్తి కాగలరని మనమంతా నమ్మేటట్లు చేశారు. అయితే, ఇప్పుడు అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకునే దేశాల వరుసలో చివరకు నెట్టివేసే పరిస్థితులు నెలకొన్నాయి. భారత్ పై 50 శాతం సుంకాలను విధించడమే కాకుండా 'సుంకాల కింగ్', 'డెడ్ ఎకానమీ' అంటూ భారత్‌పై ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలు గమనిస్తే ఓ విధంగా భారత్‌ను భయపెట్టి తన దారికి తెచ్చుకొనే ప్రయత్నం చేస్తున్నట్లు స్పష్టం అవుతుంది. నేడు సర్వత్రా భావిస్తున్నట్లు మనం రష్యా నుండి చమురు, ఆయుధాలు కొనుగోలు చేయడం మాత్రం అందుకు కారణం కాదు. ట్రంప్ తన మొదటి అధ్యక్ష పదవీ కాలం నాటి సమయంలో ప్రారంభమైన వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయడంలో భారత్ జరుపుతున్న జాప్యంతో ఆయన ఆగ్రవేశాలు వ్యక్తం చేస్తున్నట్లు కనిపిస్తోంది. 2019లో టెక్సాస్‌లో మోడీని కలిసిన సమయంలోనే ఆ ఒప్పందంపై ఇరువురం సంతకాలు చేయబోతున్నట్లు ట్రంప్ భావించారు. కానీ, ఆ చర్చలు ఆ మరుసటి రోజే న్యూయార్క్ లో విఫలం అయ్యాయి. ఫిబ్రవరి 2020 గుజరాత్‌లో కలిసినప్పుడు వ్యవసాయం, పాల ఉత్పత్తులకు సంబంధించి రెండు దేశాల మధ్య స్పష్టమైన విభేదాలను నిజాయతీతో ఒప్పుకోకుండా ఒప్పందం దాదాపు ఖరారు అయిన్నట్లే రెండు దేశాల అధికారులు చెబుతూ వచ్చారు. దురదృష్టవశాత్తు, ట్రంప్ రిపబ్లికన్ మద్దతుదారులు వ్యవసాయ ప్రాంతం నుండి రావడంతో ఈ రంగంపైనే ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. అమెరికా వాణిజ్య కార్యదర్శి హొవార్డ్ లుట్నిక్ 'మీరు చాలా పెద్ద దేశం అని చెప్పుకుంటున్నారు. మీరు అమెరికన్ మొక్కజొన్నను అంగీకరించడం లేదు' ఆగ్రహంతో తన అక్కసును వెళ్లగక్కుకున్నారు. గత వారం రోజులుగా జరుగుతున్న పరిణామాలను గమనిస్తే భారత్, చైనా, రష్యా ఓ కూటమిగా ఏర్పడి అమెరికా ఆధిపత్య ధోరణులను ఎదుర్కొనే అవకాశాకు కనిపిస్తున్నాయి. ఆరేళ్ళ తర్వాత చైనా పర్యటనకు మోడీ బయలుదేరడం, ఆయన రష్యా అధ్యక్షుడు పుతిన్ తో ఫోన్‌లో మాట్లాడటం, ఈ ఏడాది చివరిలో భారత్ రానున్నట్లు ఆయన ప్రకటించడం వేగంగా జరిగిపోయాయి. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీలలో చైనాలోని టియాంజిన్‌ను సందర్శిస్తారని ధ్రువీకరించిన మరుసటి రోజు తర్వాత పుతిన్ భారత్ పర్యటనను ప్రకటించారు. ఈ రెండు పర్యటనలు రష్యా- భారత్ -చైనా (ఆర్ఐసి) ట్రోయికా పునరుద్ధరణకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెరుగుతున్న పాశ్చాత్య ఆధిపత్యాన్ని ఎదుర్కోవడానికి 1990లలో ఆర్ఐసి త్రైపాక్షిక వ్యూహాత్మక సమూహాన్ని మాజీ రష్యా ప్రధాన మంత్రి యెవ్జెనీ ప్రిమాకోవ్ రూపొందించారు. 90ల నుండి, ఆర్ఐసి 20 మంత్రుల స్థాయి సమావేశాలను నిర్వహించింది. అయితే, 2020 గాల్వన్ లోయ ఘర్షణ తర్వాత భారతదేశం, చైనా మధ్య సంబంధాలు క్షీణించడంతో ఆర్ఐసి నిష్క్రియంగా ఉంది. ఆర్ఐసి దేశాలు ప్రపంచ జిడిపిలో 33 శాతానికి పైగా దోహదం చేస్తాయి. అవి అంతర్జాతీయ వ్యవహారాలలో ఒక్కరే ఆధిపత్య ధోరణి ప్రదర్శించడాన్ని వ్యతిరేకిస్తూ, బహుళ ధ్రువ ప్రపంచాన్ని ప్రోత్సహించాయి. ఈ మూడు దేశాలూ అణుశక్తులు కావడమే కాకుండా ఎస్‌సిఒ, బ్రిక్స్, జి20 వంటి కీలకమైన కూటమిలలో కూడా సభ్యులు. చైనాతో సంబంధాలు దెబ్బతినడంతో భారత్ ఆర్ఐసికి దూరంగా ఉంటూ వస్తున్నది. అయితే, మారిన ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో రష్యాతో తన సాన్నిహిత్యాన్ని ప్రశ్నించే రీతిలో ట్రంప్ భారతదేశం పై సుంకాలను విధించడంతో, న్యూఢిల్లీ ఇప్పుడు ఆర్ఐసి గురించి తన వ్యూహాన్ని పునరాలోచించాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. గత నెలలో, భారతదేశం కూడా ఆర్ఐసిని పునరుద్ధరించడానికి సుముఖతను ప్రదర్శించింది. దాని పునరుద్ధరణ గురించి ఏదైనా చర్చను 'పరస్పర అనుకూలమైన రీతిలో' తీసుకుంటామని చెప్పింది. 'ఆర్ఐసి అనేది ఒక సంప్రదింపుల ప్రక్రియ. ఇది మూడు దేశాలు తమకు ఆసక్తి ఉన్న ప్రపంచ, ప్రాంతీయ సమస్యలను చర్చించడానికి కలిసి వచ్చే యంత్రాంగం' అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ జులైలో పేర్కొన్నారు. ముఖ్యంగా, రష్యా, చైనా రెండూ ఆర్ఐసి పునరుద్ధరణ కోసం ఒత్తిడి తెస్తున్నాయి. గత నెలలో, త్రైపాక్షిక ప్రక్రియ పునరుద్ధరణ కోసం భారతదేశం చైనాతో కూడా చర్చలు జరుపుతున్నట్లు రష్యా తెలిపింది. 'ఈ మూడు దేశాలు బ్రిక్స్ వ్యవస్థాపకులతోపాటు ముఖ్యమైన భాగస్వాములు కాబట్టి ఈ ప్రక్రియ పని చేసేలా చేయడంలో మేము ఆసక్తి కలిగి ఉన్నాము' అని రష్యా ఉప విదేశాంగ మంత్రి ఆంద్రీ రుడెకో తెలిపారు. అమెరికా నుండి పదేపదే బెదిరింపులు వచ్చినప్పటికీ, భారతదేశం రష్యాతో తన సంబంధాల నుండి వెనక్కి తగ్గదని పుతిన్ పర్యటన చూపిస్తుంది. ట్రంప్ సుంకాల బెదిరింపులు కూడా మూడు దేశాలను దగ్గర చేస్తున్నాయి. భారతదేశంపై 50% సుంకాలు విధించాలనే ట్రంప్ పరిపాలన నిర్ణయాన్ని రష్యా, చైనా రెండూ విమర్శిస్తున్నాయి. చైనా పట్ల ఉదారంగా వ్యవహరిస్తూ, భారత్‌పై ట్రంప్ చూపిస్తున్న పక్షపాతి వైఖరి భవిష్యత్తులో అమెరికాకు నష్టం చేకూర్చే అవకాశం ఉందని పేర్కొంటూ 50 శాతం సుంకాల కారణంగా భారత్- చైనా, రష్యాలతో జట్టు కట్టే అవకాశం ఉందని అమెరికా మాజీ జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ హెచ్చరించడం గమనార్హం. మరో ఆసక్తికరమైన పరిణామంలో చైనా దినపత్రిక గ్లోబల్ టైమ్స్ తన సంపాదకీయంలో ప్రధాని మోడీ, భారతదేశాన్ని ప్రశంసించింది. ప్రధాని మోడీ చైనా పర్యటనను ప్రస్తావిస్తూ ఆ పత్రిక సంపాదకీయం ఇలా చెబుతోంది: 'హిందూ సామెత చెప్పినట్లుగా, 'మీ సోదరుడి పడవను దాటడానికి సహాయం చేయండి, మీ పడవ ఒడ్డుకు చేరుకుంటుంది'. ఆరోగ్యకరమైన చైనా- భారతదేశం సంబంధం ఈ ప్రాంతానికి, ప్రపంచానికి సానుకూల ప్రభావాలను తెస్తుంది. ద్వైపాక్షిక సంబంధాలను, ఆచరణాత్మక సహకార ప్రణాళికలను మెరుగుపరచడానికి, 'డ్రాగన్, ఏనుగు కలిసి నృత్యం చేయడం' అనే కొత్త అధ్యాయాన్ని సంయుక్తంగా ప్రారంభించేందుకు నిజమైన ఉద్దేశ్యాలతో చైనాను సందర్శించాలని మేము ప్రధానమంత్రి మోడీని స్వాగతిస్తున్నాము.' వీటన్నింటికీ మించి ఇటీవల పాకిస్తాన్‌తో 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా జరిగిన యుద్ధం సందర్భంగా చైనా ప్రత్యక్షంగా పాల్గొనకపోయినప్పటికే వ్యూహాత్మకంగా పాకిస్థాన్‌కు మద్దతుగా ఉంది. ఆయుధాల సరఫరాతో పాటు నిఘా సమాచారం కూడా అందించింది. భారత్ సేనల కదలికలపై పాకిస్థాన్‌కు చైనా నుండి ఖచ్చితమైన సమాచారం ఎప్పటికప్పుడు అందుతూ వచ్చిందని సిడిఎస్ అనిల్ చౌహన్ చెప్పుకొచ్చారు. అంతేకాదు, పశ్చిమాసియాలో పాకిస్థాన్‌తో చైనా, బంగ్లాదేశ్‌లు భారత్‌కు వ్యతిరేకంగా చేతులు కలిపితే రక్షణ పరంగా సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తుందని కూడా చెప్పారు. అందుకనే, ఈ విషయంలో చైనా జోక్యాన్ని పరిమితం చేసేందుకు భారత్ వ్యూహాత్మకంగా అడుగులు వేసేందుకు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల మన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి డా. జైశంకర్ ఆ దేశంలో వరుసగా పర్యటనలు జరిపారు. జాతీయ భద్రతా సలహాదారుడు అజిత్ దోవల్ కూడా జరిపారు. అంతర్జాతీయంగా అమెరికా నుండి ఎదురయ్యే సవాళ్లతో పాటు ప్రాంతీయంగా పాకిస్థాన్‌తో ఎదురయ్యే భద్రతాపరమైన సవాళ్లు ఎదుర్కొనేందుకు సైతం చైనాతో కూటమి పునరుద్ధరణకు భారత్ వ్యూహాత్మకంగా ముందడుగు వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత్ పై సుంకాలు తమ దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగించగలదని అమెరికాలో సైతం అసమ్మతి వ్యక్తం అవుతుంది. భారత సంతతికి చెందిన రిపబ్లికన్ నాయకురాలు నిక్కీ హేలీ భారత్ లాంటి బలమైన మిత్రదేశంతో సంబంధాలను తెచ్చుకోకండి అంటూ సున్నితంగా ట్రంప్‌కు మందలించారు. 'రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయకూడదు. కానీ చైనా చేయొచ్చా?' అని ఆమె ప్రశ్నించారు. రష్యా, ఇరాన్ నుంచి చమురు కొనుగోలుదారులో చైనా నంబర్ వన్‌గా ఉందని ఆమె గుర్తు చేశారు. అలాంటిది చైనాకు మాత్రం 90 రోజుల పాటు ఎలాంటి సుంకాలు విధించకుండా మినహాయింపు ఇవ్వవచ్చా? అని ఆమె నిలదీశారు. చైనాకు మినహాయింపు ఇచ్చి భారత్ లాంటి బలమైన మిత్రదేశంతో సంబంధాలను దూరం చేసుకోవద్దని ఆమె సూచించారు. రష్యా నుంచి చమురు కొనవద్దని ట్రంప్ భారత్‌ను బెదిరిస్తూ, మరోవైపు, చైనాకు రాయితీలు ఇచ్చాడు. కానీ భారత్ ఈ సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకుంటుంది. భారతదేశం, రష్యా, చైనా ఉమ్మడిగా వ్యవహరిస్తే వారు ట్రంప్ సుంకాల బెలూన్‌ను బద్దలయ్యేటట్లు చేయవచ్చు.

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు.. గాలిలో దీపాలా?



హైదరాబాద్,సాఫ్ట్‌వేర్ రంగం తన ఉద్యోగులను మరోసారి కాటేయడం మొదలు పెట్టింది. పగలనక, రాత్రనక పనిమీదే ధ్యాసపెట్టే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఇప్పుడు ఉద్యోగం ఉంటుందా ఊడుతుందా అనే బెంగతో బతుకుతున్నారు. ఉద్యోగం పోయినవాళ్లు నడి సంద్రంలో చిక్కుకున్నట్లు విలవిలలాడుతుంటే, పనిచేస్తున్నవారేమో ఎప్పుడు పిడుగులాంటి వార్త వినవస్తుందోనని వణికిపోతున్నారు. చిన్న, పెద్ద కంపెనీలనే భేదం లేదు, సీనియర్, జూనియర్ ఉద్యోగి అన్న పట్టింపులేదు. వరుస పెట్టినట్లు వేలమందిని కంపెనీలు నిర్దాక్షిణ్యంగా ఇంటికి పంపుతున్నాయి. లాభాపేక్షతో పని చేసే ఈ కంపెనీలను తప్పును పట్టేలా లేదు. సాంకేతిక పరిశోధన, నూతన ఆవిష్కారాలను కాదనలేరు. నిన్నటి చదువు నేటి ఉద్యోగానికి పనికి రాదు. నేటి చదువు తలకెక్కేదాకా ఉద్యోగం ఆగదు. ఇదే అదునుగా కంపెనీలు ఉన్న ఉద్యోగులపై పనిభారం పెంచి పీల్చి పిప్పి చేస్తున్నాయి. ఇంత పని చేయలేను అని చెబితే రేపటి నుంచి రానవసరం లేదని అంటారని నోరు మెదపకుండా వారు ఉండక తప్పడం లేదు. పని చేసి చేసి ఇంటి దాకా పోయే ఓపికలేక ఆఫీసు బయట ఫుట్‌పాత్‌పై పడుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చిత్రం వార్తల్లో వచ్చింది. ప్రభుత్వ రంగం(%+శీజవతీఅవత్ ంవషీశీతీ%) తన ఉద్యోగికి పదవి విరమణ దాకా భరోసా ఇస్తుంది. ప్రైవేటు వ్యవస్థలు మాత్రం రక్తమాంసాలను, మేధస్సును తూకం వేసి ఉద్యోగాల్లో కొనసాగనిస్తాయి. సాఫ్ట్‌వేర్ రంగంలో కొత్తగా వచ్చిన ఆటోమేషన్, కృత్రిమ మేధ ఇలా వేల ఉద్యోగాలను ఊడ్చేస్తున్నాయి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ డెవలపర్స్ చేసే పనులను ఈ రెండు కొత్త పనిముట్లు వేగంగా, తక్కువ ఖర్చుకు చేసి పెట్టే రోజులు రెండేళ్ల క్రితమే మొదలయ్యాయి. 2023 నుండే వాటి ధాటికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు రెప రెపలాడుతున్నాయి. నైపుణ్య లేమి అని మన గ్రాడ్యుయేట్లను ఆడిపోసుకొనే రోజులు పోతున్నాయి. ఐఐటిలో చదివిన వారికి కూడా ఉద్యోగం గ్యారంటీ లేదు. పది, ఇరవై ఏళ్ల అనుభవం, అద్భుత వృత్తి పరిజ్ఞానం ఉన్నా ఉద్యోగాన్ని కాపాడలేకపోతున్నాయి. కొత్త సాంకేతిక ఆవిష్కారాల వల్ల తక్కువ ఉద్యోగులతోపాటు ఖర్చు, సమయం ఆదా అవుతుంటే ఏ కంపెనీ అయినా అటువైపే అడుగులు వేస్తుంది. ఏడాదికేడాది కంప్యూటర్ డెవలపర్ల అవసరాలు తీరిపోతాయని నిపుణులు అంటున్నారు. మనిషి చేసే పనులను యంత్రాలు వేగంగా చేసి పెడుతుంటే వ్యవసాయంతోపాటు నిర్మాణ, ఉత్పత్తి, సేవారంగాల్లో సమూల మార్పులు వచ్చాయి. కొత్తగా వస్తున్న కృత్రిమమేధ కంపెనీలు పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీల ప్రాజెక్టులపై ప్రభావం చూపి వాటి ఉనికినే ప్రశ్నార్థకం చేస్తాయని అంటున్నారు. అంటే రేపటి కాలమంతా ఎఐ కంపెనీలదే అన్నమాట. డాక్టర్లు, యాక్టర్లు, టీచర్లు, ఆర్టిస్టులు, డ్రైవర్లు, వెయిటర్లు ఇలా అన్ని వృత్తులు, పనులు కృత్రిమమేధ తక్కువ ఖర్చుతో చేసి పెడుతుంది. కంప్యూటర్ కోర్సులు చదువుతున్నవారు, వాటిలో చేరబోయేందుకు సిద్ధపడ్డవారు నేటి పరిస్థితులను గమనించి అయోమయంలో పడుతున్నారు. మంచి ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ కోర్సులో సీటు వస్తే చాలు, జీవితంలో సెటిల్ అయినట్లే అని నమ్మినవారు సైతం ఉద్యోగం వస్తుందో లేదో అనే డైలమాలో పడిపోయారు. ప్లేస్‌మెంట్ అయినవారికి జాబ్ ఆర్డర్ చేతికి రావడం లేదు. సాఫ్ట్‌వేర్‌ను నమ్ముకుంటే లాభం లేదనే ఆలోచన కూడా ఇప్పుడిప్పుడే మొదలైంది. ఈ సంవత్సరం ఇంజినీరింగ్ సీట్ల ఎంపిక ఈ విషయానికి బలాన్నిస్తోంది. సివిల్, మెకానికల్ సీట్ల వైపు ఆసక్తి పెరిగింది. జెఎన్‌టియు, క్యాంపస్‌లో కంప్యూటర్ అనుబంధ కోర్సుల్లో 30 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఎప్పుడైనా తొలి కౌన్సిలింగ్‌లోనే చకచకా భర్తీ అయ్యే ఈ సీట్లు ఇలా మిగిలిపోవడం, సివిల్, మెకానికల్ సీట్లు నిండిపోవడం చూస్తుంటే ఓ కొత్త మార్పు రాబోతుందనిపిస్తోంది. ఇప్పటి వరకు దేశంలోని వివిధ కంపెనీలు 80 వేల మంది ఉద్యోగులను తొలగించాయి. వాటిలో మైక్రోసాఫ్ట్, టిసిఎస్, గూగుల్ లాంటి కంపెనీలు పెద్ద సంఖ్యలో సిబ్బందిని తగ్గిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు పోవడం కొత్తేమి కాదు. అయితే గతంలో తగినన్ని ప్రాజెక్టులు రాకపోవడంతో కంపెనీలు పనిలేని ఉద్యోగులను ఇంటికి పంపేవి.

## ఎన్నికల సంఘానికి గట్టి దెబ్బ

న్యూఢిల్లీ, ఎన్నికల సంఘానికి గట్టి దెబ్బ తగిలింది. బీహార్ ఓటర్ జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది పేర్లను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరచాలని, వారి పేర్లను తొలగించడానికి గల కారణాలను కూడా అప్‌లోడ్ చేయాలని సూచించింది. ప్రతి ఓటరు దానిని యాక్సెస్ చేయగలిగేలా ఈ జాబితాను ప్రచారం చేయాలని సూచించింది. అయితే.. ఆ 65 లక్షల మంది వివరాలను ఈ నెల 19లోపు బహిర్గతం చేయాలని ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ నెల 22 నాటికి సంబంధిత నివేదికను తమముందు ఉంచాలని సూచించింది. మరో రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ఓటర్ జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను జస్టిస్ సూర్యకాంత్ విచారించారు. జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మందిలో 22 లక్షల మంది మరణించారని ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. 22 లక్షల మంది మరణించినట్లయితే, దానిని బూత్ స్థాయిలో ఎందుకు వెల్లడించలేదని, పౌరుల హక్కులు రాజకీయ పార్టీలపై ఆధారపడి ఉండాలని తాము కోరుకోవడం లేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. 65 లక్షల మంది పేర్లను, వారిని తొలగించడానికి గల కారణాన్ని ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరచాల ని సూచించారు. ఆ విషయాన్ని గరిష్ట సర్క్యులేషన్ ఉన్న స్థానిక భాషా వార్తాపత్రికల ద్వారా, దూరదర్శన్, ఇతర ఛానెళ్ల ద్వారా ప్రచారం కల్పించాలని సూచించింది. జిల్లా ఎన్నికల అధికారికి సోషల్ మీడియా హ్యాండిల్ ఉంటే, అక్కడ కూడా నోటీసును ప్రదర్శించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆ జాబితాలో పేరు ఉన్న వ్యక్తులు తమ పేరును ఎందుకు తొలగించకూడదో పేర్కొంటూ తమ ఆధారాలను జిరాక్స్ కాపీలతో సహా సమర్పించుకోవడానికి అవకాశాలు కల్పించాలని పేర్కొంది. ఓటర్ జాబితా నుంచి తొలగించిన పేర్లను అన్ని పంచాయతీ భవనాలు, బ్లాక్ డెవలప్‌మెంట్, పంచాయతీ కార్యాలయాల నోటీసుబోర్డుపై కూడా ప్రదర్శించాలని, తద్వారా ప్రజలు జాబితాను మాన్యువల్‌గా యాక్సెస్ చేసుకునే వీలుంటుందని తెలిపింది. బిహార్‌లో ఇటీవల నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో 65 లక్షల మంది పేర్లను తొలగించిన విషయం తెలిసిందే. అదేవిధంగా.. ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైనవారు ఆధార్ కార్డు సమర్పించవచ్చని తెలిపింది. బిహార్‌లో ఎస్ఐఆర్ పక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టులో గురువారం విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం తన వాదనలు వినిపిస్తూ.. ఓటర్ల జాబితా సవరణ వంటి నిర్ణయాలు తీసుకునేందుకు ఈసీకి అధికారాలు ఉన్నాయి. రాజకీయ వాతావరణంలో పనిచేస్తున్న నేపథ్యంలో.. వివాదాస్పదం కాని నిర్ణయమంటూ ఏదీ లేదు. పార్టీల పోరు మధ్యలో చిక్కుకున్నాం. గెలిస్తే ఈవీఎంలు మంచివని, ఓడిపోతే చెడ్డవని ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. ఓటర్ల జాబితాలో మరణించిన, వలసవెళ్లిన, ఇతర నియోజకవర్గాలకు తరలిన ఓటర్ల పేర్లను ఎందుకు వెల్లడించలేరని ఈసీని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. ఆ పేర్లను ఎందుకు బహిర్గతం చేయకూడదని.. తద్వారా బాధితులు 30 రోజుల్లోపు పరిష్కార చర్యలు తీసుకోవచ్చు కదా అని తెలిపింది. పౌరుల హక్కులు రాజకీయ నేతలపై ఆధారపడి ఉండకూడదని భావిస్తున్నట్లు చెప్పింది. అయితే.. తొలగించిన వ్యక్తుల జాబితాను పార్టీలకు ఇచ్చినట్లు- ఈసీ వెల్లడించింది. జిల్లా స్థాయిలో ఈ వివరాలను పంచుకునేందుకు సిద్ధమని తెలిపింది. ఈ క్రమంలోనే ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను ఆగస్టు 19 నాటికి బహిర్గతం చేయాలని ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు ఆదేశించింది. తొలగింపునకు కారణాలు సహా ప్రచురించి.. జిల్లా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందుబాటులో ఉంచాలని తెలిపింది.

## ఎవరికి ఈ అవమానం ?

చెన్నై:గవర్నర్ అన్నది రాజ్యాంగబద్ధమైన ఒక వ్యవస్థ. రాజ్యాంగం ప్రకారం అత్యున్నతమైనది. నడిచే రాజ్యాంగం అని కూడా చెబుతారు. ఒక రాష్ట్రానికి గవర్నర్ అంటే తొలి పౌరుడు కింద లెక్క. అయితే ఆయనకే అవమానం జరిగింది. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవికి ఏ రాజ్యాంగపాల్ కి జరగని విధంగా ఈ అవమానం జరిగింది. ఆయన తమిళనాడులోని ఓ విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గవర్నర్ చేతుల మీదుగా డిగ్రీలు ప్రదానం చేయడం ఒక ఆచారం. మొదటి నుంచి వసతున్న సంప్రదాయం.

ఆయన చేతుల మీదగా నో :

ఇదిలా ఉంటే ఒక విద్యార్థిని అనూహ్యంగా గవర్నర్ ఆర్ఎన్ రవి చేతుల మీదుగా పట్టా తీసుకునేందుకు నిరాకరించడం ఇపుడు పెద్ద ఎత్తున చర్చగా మారింది. ఆమె గవర్నర్ పక్కన నిలబడి ఉన్న ఉప కులపతి నుంచి ఈ పట్టాను తీసుకున్నారు. ఇక ఆమె గవర్నర్‌ను దాటుకుని వెళ్లి వీసీ నుంచి డిగ్రీ స్వీకరించడం విశేషం. ఇక గవర్నర్ తమిళ ప్రయోజనాలకు వ్యతిరేకి అని ఆమె ఆరోపించారు. అయితే ఈ విధంగా గవర్నర్ కి నిరసన తెలిపిన విద్యార్థిని డీఎంకే నేత భార్యగా చెబుతున్నారు.

ఆమె చర్యతో ఆశ్చర్యం :

ఇదిలా ఉంటే తమిళనాడులోని తిరునల్వేలిలోని మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయం 32వ స్నాతకోత్సవం సందర్భంగా ఈ ఘటన జరిగింది. ఈ కార్యక్రమానికి 650 మందికి పైగా విద్యార్థులు హాజరైతే ఆ విద్యార్థిని మాత్రమే గవర్నర్ ని వ్యతిరేకినడం సామాజిక మాధ్యమాలలో వైరల్ అయింది. గవర్నర్ ని పక్కన పెట్టి ఆమె చేసిన ఈ పనికి వేదికపై ఉన్న అధికారులు, సభలో ఉన్న విద్యార్థులు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. ఇదంతా జాగ్రత్తగానే గమనించిన తమిళనాడు గవర్నర్ రవి పూర్తిగా మౌనం పాటించారు.

నాకు ఇష్టం లేదంతే :

ఇక తాను పట్టాను అందుకున్న తరువాత సదరు విద్యార్థిని జీన్ జోసెఫ్ తన చర్యను చాలా గట్టిగానే సమర్థించుకున్నారు. గవర్నర్ రవి తమిళనాడుకు రాష్ట్ర తమిళ ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆమె విమర్శించారు. ఈ కారణంగానే తాను ఆయన చేతుల మీదుగా పట్టాను అందుకోవడానికి ఏ మాత్రం ఇష్టపడడం లేదని ఆమె చెప్పుకొచ్చారు. ఇలా ఆమె ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

రాజకీయాలకు వేదికగా :

విశ్వవిద్యాలయాలు అన్నింటికీ అతీతమైనవి. కానీ రాజకీయాలకు వాటిని వేదికగా మార్చుకోవడం ఏ మేరకు సబబు అన్న చర్చ అయితే సాగుతోంది. ఇక జీన్ జోసెఫ్ డీఎంకే పార్టీకి చెందిన నాగర్‌కోయిల్ టౌన్ యూనిట్ డిప్యూటీ సెక్రటరీ రాజన్ భార్య అని చెబుతున్నారు. మరో వైపు చూస్తే తమిళనాడు రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వానికి గవర్నర్‌కు అనేక విషయాల మీద వివాదాలు జరుగుతూ వస్తున్నాయి. అవి ఏకంగా సుప్రీం కోర్టు దాకా వెళ్ళాయి. అయితే ప్రభుత్వాలు రాజకీయాలు విధానపరమైన అంశాలు వేరు, విశ్వవిద్యాలయాలలో ఈ తరహా ఘటనలు వేరు అని అంటున్నారు.

భిన్న వాదనలు :

ఇక పరిశోధనా విద్యార్థిని జీన్ జోసెఫ్ చేసిన పని పట్ల సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు నెటిజన్ల నుంచి వస్తున్నాయి. ఆమె ధైర్యాన్ని కొందరు కొనియాడుతూంటే స్నాతకోత్సవం లాంటి వేదికను రాజకీయ నిరసనలకు వాడుకోవడం సరికాదని మరికొందరు దుయ్యబెడుతున్నారు. ఏది ఏమైనా ఇలా కూడా నిరసనలు తెలియచేయవచ్చు అని నిరూపించిన జీన్ జోసెఫ్ సరికొత్త రాజకీయ పరిశోధన ఇలా చేశారు అని సెటైర్లు వినిపిస్తున్నాయి.

# సీఎంపై ప్రశంసలు.. ఎమ్మెల్యేను బహిష్కరించిన పార్టీ



లక్నో, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను ప్రశంసించిన కారణంగా సమాజ వాదీ ఎమ్మెల్యే పూజా పాల్‌ను ఆ పార్టీ నుంచి అగ్ర నాయకత్వం బహిష్కరించింది.

పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడంతోపాటు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందున పూజా పాల్‌ను పార్టీ నుంచి బహిష్కరించినట్లు సమాజ వాదీ పార్టీ ప్రకటించింది. ఈ మేరకు గురువారం ఆ పార్టీ ఒక ప్రకటన విడుదల చేసింది.ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో గురువారం చర్చ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సమాజ వాదీ ఎమ్మెల్యే పూజా పాల్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీసుకుంటున్న చర్యల కారణంగా.. రాష్ట్రంలో శాంతి భద్రతలు మెరుగుపడ్డాయన్నారు. అలాగే నేరాల సంఖ్యను తగ్గించేందుకు ఆయన చేపట్టిన విధానాలు సత్ ఫలితాలు ఇస్తున్నాయని.. అందులోభాగంగా నేరాలు దాదాపుగా తగ్గిపోయాయంటూ ఆమె ప్రశంసించారు. అందులోభాగంగా సీఎంకు పూజా పాల్ ధన్యవాదాలు సైతం తెలిపారు. సీఎం యోగికి ధన్యవాదాలు చెప్పిన కొన్ని గంటలకే.. పూజా పాల్‌ను సమాజ వాదీ పార్టీ నుంచి బహిష్కరించడం గమనార్హం.

# వైసీపీ స్వయంకృతం.. అప్పుడే ఎన్నిక నిర్వహిస్తే..

అమరావతి,పులివెందులలో పరాజయంతో వైసీపీ తీరని అప్రతిష్ట మూటగట్టుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఈ పరాజయం వైసీపీ స్వయంకృతం అంటూ విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. తమ సొంత అడ్డాలో ఈ పరిస్థితిని ఊహించని వైసీపీ అగ్ర నాయకత్వం తీవ్ర అవమానం ఎదుర్కోవాల్సి వచ్చిందని అంటున్నారు. వాస్తవానికి వైసీపీకి ఈ పరిస్థితి వచ్చే అవకాశం లేదని, కానీ ఆ పార్టీ అగ్ర నాయకత్వం నిర్లక్ష్యం కారణంగానే సిటింగు స్థానాన్ని కోల్పోవడంతోపాటు అధినేత సొంత మండలంలో పట్టు నిలుపుకోలేకపోయామనే అపప్రదను మోయాల్సి వస్తోందని వైసీపీ కేడర్ వాపోతుంది.

2022లో ఎన్నిక నిర్వహిస్తే..

పులివెందుల జడ్పీటీసీ మహేశ్వరరెడ్డి మరణంతో తాజాగా ఉప ఎన్నిక నిర్వహించారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే జడ్పీటీసీ మహేశ్వరరెడ్డి మరణించారు. అప్పుడే ఉప ఎన్నిక జరిగేలా చర్యలు తీసుకుంటే ఇప్పుడు ఈ ఎన్నిక జరిగేది కాదని, ఓటమిని భరించాల్సిన అవసరం వచ్చేది కాదని వైసీపీ నేతలు అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. 2021లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే, జడ్పీటీసీ మహేశ్వరరెడ్డి 2022లో రోడ్డు ప్రమాదంలో మరణించారు. జడ్పీటీసీ మరణంతో ఏర్పడిన ఖాళీలో వెంటనే ఎన్నిక నిర్వహించే అవకాశం ఉంది. కానీ 2022 నుంచి 2024 జూన్ వరకు అధికారంలో ఉన్న వైసీపీ ఏ కారణం చేతనో పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక నిర్వహణకు ఆసక్తి చూపలేదు. ఫలితంగా ఇప్పుడు ఈ ఓటమిని మూటగట్టుకోవాల్సివచ్చిందని అంటున్నారు.

టీడీపీకి చాన్స్ ఇచ్చింది వైసీపీయే..

వాస్తవానికి 2024లోగా పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక నిర్వహిస్తే ఇక్కడ టీడీపీకి చాన్స్ దక్కేది కాదు. కానీ, వైసీపీ అధికారంలో ఉండగా, తమ సొంత ఇలాకాలో ఇటువంటి పరిస్థితిని ఊహించలేదని చెబుతున్నారు. ఎన్నిక ఎప్పుడు జరిగినా, ఏకగ్రీవం అవుతుందని ధీమాతో 2022 నుంచి ఉప ఎన్నిక నిర్వహించలేదు. అయితే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన టీడీపీ ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకుందని అంటున్నారు.

పరోక్ష విజయాలపై హేళన

టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పలు మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్



పాలకవర్గాలను కైవసం చేసుకుంటూ వచ్చింది. అయితే వైసీపీ తరఫున గెలిచిన వారికి కండువాలు మార్చి టీడీపీ ఆయా స్థానాలను తమ ఖాతాల్లో వేసుకుంటుందని వైసీపీ నేతలు విమర్శిస్తూ టీడీపీ విజయాలకు పెద్దగా ప్రాధాన్యం లేనట్లు తేల్చేసేవారు. అయితే అవన్నీ పరోక్ష ఎన్నికలు కావడంతో ప్రజల్లోనూ పెద్ద చర్చ జరగలేదు. ఇదే సమయంలో ప్రభుత్వం పులివెందుల, ఒంటిమిట్ట స్థానాలపై ఫోకస్ చేసిందని అంటున్నారు. ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించి పులివెందుల, ఒంటిమిట్టలో వైసీపీతో అమీతుమీ తేల్చుకోవాలని నిర్ణయించిందని చెబుతున్నారు.

వ్యూహాత్మకంగా టీడీపీ

అందుకే నిండా ఏడాది కూడా లేని జడ్పీటీసీ పదవులకు ఉప ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించిన టీడీపీ, వ్యూహాత్మకంగా పావులు కదిపి వైసీపీని దెబ్బతీసిందని అంటున్నారు. తాజా ఫలితాలపై వైసీపీ ఏ వాదన వినిపించినా, ఓటమిని అంగీకరించాల్సిన పరిస్థితి ఉందని పరిశీలకులు చెబుతున్నారు. అధికార పార్టీ అక్రమాలు చేస్తుందని వాదిస్తున్న వైసీపీ.. ముందుగానే ఎన్నిక జరగకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. హైకోర్టు ద్వారా లేదా ఇతర చట్టబద్ధ మార్గాల ద్వారా ఎన్నికను అడ్డుకుంటే ఈ పరాభవం ఎదురయ్యే పరిస్థితి నుంచి తప్పించుకునే అవకాశం ఉండేదని అంటున్నారు. మొత్తానికి ఈ పరాజయం వైసీపీ స్వయంకృతమన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

# భారీ వర్షాలతో జంటనగర జలాశయాలకు జలకళ

హైదరాబాద్, భారీ వర్షాలకు హైదరాబాద్‌లోని జలాశయాలు నిండుకుండలా మారాయి. జంట నగరాలకు తాగు నీరు అందించే హిమాయత్ సాగర్ జలకళను సంతరించుకుంది. జలాశయానికి వరద ప్రవాహం పెరగడంతో 9 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. హిమాయత్ సాగర్ డ్రోన్ దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి. హైదరాబాద్‌లో భారీ వర్షాలకు మూసీ పరివాహకంలోని పలు కాలువలు పొంగుతున్నాయి. హిమాయత్ సాగర్ నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో మూసీలో ప్రవాహం పెరిగింది. దీంతో పురానాపూల్ శ్మశాన వాటిక నీట మునిగింది. ఫలితంగా అక్కడ జరగాల్సిన అంత్యక్రియల కు విఘాతం కలిగింది. శవాలకు కాల్చేందుకు ఉపయోగించే కట్టెలు నీటిలో తేలియాడుతున్నాయి. వర్షాల కారణంగా అంబర్‌పేటలోని మూసారాంబాగ్ బ్రిడ్జికి ఆనుకొని గత మూడు రోజులుగా వరద ప్రవహిస్తోంది. బ్రిడ్జి వద్ద వరద ప్రవాహాన్ని తగ్గించడం కోసం మూసీలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, బురద మట్టిని హైడ్రా సిబ్బంది తొలగిస్తున్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద నీరంతా ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లోకి చేరుతుండటంతో నిండుకుండగా మారాయి. దీంతో జలమండలి అధికారులు.. హిమాయత్ సాగర్ గేట్లను ఎత్తి మూసీలోకి వరద నీటిని వదిలారు. దీంతో మూసీ నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. బాపుఘాట్, జియాగూడ, పురానాపూల్, నయాపూల్,



ఛాదర్ ఘాట్, ముసారాంబాగ్ వద్ద మూసీ ఉరకలెత్తుతోంది. జియాగూడ, పురానాపూల్ వద్ద పరివాహక ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. జియగూడ బైపాస్‌లోకి వరద రావడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. అటువైపు ఎవరూ వెళ్లకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు– చేశారు. మూసీని అనుకొని ఉన్న పలు ఆలయాలు, శ్మశాన వాటికల్లోకి వరద నీరు చేరింది. ఛాదర్‌ఘాట్ వద్ద చిన్న వంతెనను తాకుతూ మూసీ ప్రవహిస్తోంది. మరోవైపు ముసారాంబాగ్ వద్ద వంతెనపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో రెండు రోజుల నుంచి పూర్తిగా రాకపోకలను నిలిపివేశారు.

# వరద ముంపులో అమరావతి?

అమరావతి,సోషల్ మీడియాలో ఏది నిజమో.. ఏది అబద్ధమో గుర్తించడం కష్టమవుతోంది. ప్రధానంగా రాజకీయ ప్రాముఖ్యత ఉన్న అంశాలను ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవాల్సివస్తోంది. కొన్నిసార్లు నిజాలు నిర్ధారించుకున్నా, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ఇక అసలు విషయానికి వస్తే ఏపీలో రాజకీయ ఆధిపత్యం కోసం టీడీపీ, వైసీపీ మధ్య నువ్వా–నేనా అన్నట్లు పోరాటం జరుగుతుంది. ఇందులో సోషల్ మీడియా పాత్ర అత్యధికం. నిత్యం తమ రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీసేలా ఉభయ పార్టీలు సోషల్ మీడియాలో పోటాపోటీ పోస్టులు పెడుతుంటాయి. ఈ క్రమంలో రెండు రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలపై మరోసారి ఫేక్ ప్రచారం జరుగుతోందని టీడీపీ సోషల్ మీడియా ఆరోపిస్తోంది.ఏపీలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం, గురువారం కురిసిన వర్షాలతో పలు చోట్ల వరద పోటెత్తింది. ఇక రాష్ట్ర రాజధాని అమరావతి ప్రాంతంలో కూడా భారీ వర్షం కురిసింది. రాజధాని ప్రాంతంలోని కొండవీడు వాగు పొంగి ప్రవహించింది. ఇక పక్కనే ఉన్న విజయవాడలో కూడా బుడమేరు, కృష్ణ నదులు ఉదృతంగా ప్రవహిస్తున్నాయి. గత ఏడాది బుడమేరు వరదలతో విజయవాడ అతలాకుతలమైంది. ఈ సారి బుడమేర ముంపు లేకపోయినా, కృష్ణ ప్రమాదకరంగా ప్రవహిస్తున్నా ప్రజా జీవితానికి పెద్దగా ఇబ్బంది ఎదురుకాలేదని చెబుతున్నారు.అయితే సోషల్ మీడియాలో మాత్రం దీనికి పూర్తి విరుద్ధమైన ప్రచారం జరుగుతోందని టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలు రాజధానిపై అపోహలు సృష్టించేందుకు భారీ వర్షాలకు అమరావతి ముంపునకు గురైందని ప్రచారం చేస్తున్నారు. రాజధాని ప్రాంతం మొత్తం నీటితో నిండిపోయిందని పెద్ద ఎత్తున వీడియోలను వైరల్ చేస్తున్నారు. అయితే పులివెందుల ఎన్నికల



కౌంటింగ్ నేపథ్యంలో అధికార పార్టీ చాలా సమయం వైసీపీ ప్రచారాన్ని గమనించలేదు. అమరావతి ముంపు అన్న వీడియోలు వైరల్ కావడంతో శుక్రవారం మధ్యాహ్నం ప్రభుత్వం స్పందించింది. ఆ వీడియోలను ఫ్యాక్ట్ చెక్ చేసింది .అమరావతి ముంపు అంటూ వైసీపీ సోషల్ మీడియా చేస్తున్న ప్రచారం ఫేక్ అంటూ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ టీమ్ తేల్చింది. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలు ప్రచారం చేస్తున్న వీడియోలు పల్నాడు జిల్లాపెదకూరపాడు నియోజకవర్గం కంభంపాడు గ్రామంలోని వాగు దృశ్యాలుగా నిర్ధారించింది. కంభంపాడులో వాగు పొంగి చప్టా పైనుంచి పారితే, ఆ దృశ్యాలను అమరావతి ప్రాంతానికి అంటూ తప్పు దోవ పట్టిస్తున్నట్లు ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ టీం ఎక్స్ లో వెల్లడించారు. కంభంపాడు గ్రామం అమరావతి రాజధానికి 120 కిలోమీటర్ల దూరంలోని ఉంటుందని వివరించింది. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేందుకు తప్పుడు ప్రచారం చేసే చట్టపరమైన చర్యలు తప్పవు అంటూ హెచ్చరించింది.

# మాతో పెట్టుకుంటే పోతారు.. పాక్ కు భారత్ వార్నింగ్



న్యూఢిల్లీ,సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, ఉగ్రవాదంపై వివాదాలు, జలవనరుల పంపిణీపై విభేదాలు భారత్–పాకిస్థాన్ సంబంధాల్లో కొత్తేమీ కాదు. అయితే, తాజాగా పాకిస్థాన్ ఆర్మీ స్టాఫ్ చీఫ్ చేసిన వ్యాఖ్యలు ఈ ఉద్రిక్తతలను మరింతగా పెంచాయి. సింధు నదిపై భారత్ డ్యామ్‌లు నిర్మిస్తే “పేల్చేస్తాం” అని ఆయన చేసిన వ్యాఖ్యలపై భారత్ తీవ్రంగా స్పందించింది.పాకిస్థాన్ నాయకులు, అధికారులు తమ మాటల్లో సంయమనం పాటించాలని, ఎలాంటి దుస్సాహసాలకు పాల్పడినా తీవ్ర పరిణామాలు ఉంటాయని భారత్ గట్టిగా హెచ్చరించింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలను స్పష్టం చేశారు.

– పాకిస్థాన్‌కు భారత్ హెచ్చరిక ఎందుకు?

పాకిస్థాన్ ఆర్మీ స్టాఫ్ చీఫ్ అసీమ్ మునీర్ సింధు నదిపై భారత్ నిర్మించే డ్యామ్‌లపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. “డ్యాములు పేల్చేస్తాం” అంటూ ఆయన సైనిక శైలిలో చేసిన వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య నమ్మక లోపాన్ని పెంచాయి. దీనిపై స్పందించిన %వీజూా% అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్, పాకిస్థాన్ నాయకులు తమ దేశంలోని వైఫల్యాలు, ఆర్థిక సంక్షోభం, ఉగ్రవాదం వంటి సమస్యల నుండి ప్రజల దృష్టిని మరల్చడానికి భారతదేశంపై నిరాధార ఆరోపణలు చేయడం అలవాటుగా మారిందని విమర్శించారు.

– సింధు జలాల ఒప్పందం: ఒక చారిత్రక అవగాహన

1960లో ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్‌ల మధ్య సింధు జలాల ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం, సింధు, జీలం, చెనాబ్ నదుల నీటిపై పాకిస్థాన్‌కు, రవి, బియాస్, సట్లజ్ నదుల నీటిపై భారత్‌కు పూర్తి హక్కులు ఉంటాయి. ఆరు దశాబ్దాలకు పైగా ఈ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ, పాకిస్థాన్ తరచుగా భారత్ ఈ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తుందని ఆరోపిస్తూనే ఉంది.ఈ ఒప్పందాన్ని భారత్ ఎల్లప్పుడూ గౌరవిస్తుందని, తన నిబద్ధతకు కట్టుబడి ఉంటుందని %వీజూా% ప్రతినిధి జైస్వాల్ స్పష్టం చేశారు. ఏవైనా దుష్ప్రయత్నాలు జరిగితే, దానికి తగిన ప్రతిస్పందన తప్పక ఉంటుందని భారత్ మరోసారి గట్టిగా చెప్పింది.

–పాకిస్థాన్ అంతర్గత సమస్యలు

ప్రస్తుతం పాకిస్థాన్ తీవ్రమైన ఆర్థిక సంక్షోభం, రాజకీయ అస్థిరత, పెరుగుతున్న అంతర్గత ఉగ్రవాదంతో పోరాడుతోంది. ఇటువంటి పరిస్థితులలో, తమ ప్రజల దృష్టిని మరల్చడానికి, జాతీయవాదాన్ని రెచ్చగొట్టడానికి నాయకులు, సైనిక అధికారులు భారతదేశంపై ఆరోపణలు చేయడం, బెదిరింపులు విసరడం సాధారణమని విశ్లేషకులు చెబుతున్నారు.

–భవిష్యత్ పరిణామాలు

పాకిస్థాన్ సైనిక ప్రధానాధికారి రెచ్చగొట్టే వ్యాఖ్యలు, భారత్ ఇచ్చిన ఘాటైన సమాధానం రాబోయే రోజుల్లో ఇరు దేశాల మధ్య సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. సరిహద్దుల్లో ఇప్పటికే నెలకొన్న ఉద్రిక్తతలు మరింతగా పెరగవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్ తన జలవనరులు, భూభాగం, ప్రజల భద్రత విషయంలో రాజీపడదని, ఏదైనా దుస్సాహసానికి భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని మరోసారి స్పష్టం చేసింది.

# ఇవిఎంలను తెచ్చిందే రాజీవ్ గాంధీ



హైదరాబాద్,దేశానికి ప్రతిపక్ష నేతగా ఉన్న వ్యక్తికి వ్యవస్థల మీద నమ్మకం లేకపోవడం దురదృష్టకరమని మెదక్ బిజెపి ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాలెట్ పేపర్ కాదని ఆ నాటి రాజీవ్‌గాంధీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించింది. రాయ్‌బరేలిలో రాహుల్ రాజీనామా చేయాలి. రాహుల్ రాజీనామా చేస్తే బ్యాలెట్ ద్వారా ఎన్నిక నిర్వహిస్తామని అన్నారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు పనిచేసినట్టు–. బిహార్‌లో ఓడిపోతారు కాబట్టి ఈవీఎంలు పనిచేయడం లేదంటున్నారు. ఈవీఎంలను తెచ్చిందే రాజీవ్‌గాంధీ. రాహుల్‌గాంధీ గెలిచిన రాయ్‌బరేలిలో 2లక్షల ఓట్లు అనుమానంగా కనిపిస్తున్నాయి. అక్కడ దొంగ ఓట్లతో గెలిచారు..రాహుల్ ఎన్నికను రద్దు చేయాలని కోరబోతున్నామని అన్నారు. రాయబరేలి రాజీనామా చేసి బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికకు సిద్ధమా? అని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. మొదట్లో బీజేపీ ఈవీఎంలను వ్యతిరేకించింది.. కానీ శాస్త్రీయ అధ్యయనం చేసిన తర్వాత ఈవీఎంలకి మద్దతు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు కరెక్ట్.. ఓడితే రాంగ్ అంటున్నారు.. రాజీవ్ గాంధీ ఆలోచన ప్రోగ్రెస్, రాహుల్ గాంధీ ఆలోచన డిస్ట్రక్టివ్ అని విమర్శించారు. స్పెషల్ ఇంటె–న్సివ్ రివిజన్‌ను కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని.. బంగ్లాదేశ్ అక్రమ వలస దారులను గుర్తించి ఓటు తీసేస్తారనే భయపట్టుకుందన్నారు. రాహుల్ గాంధీ గెలిచిన రాయబరెలిలో 2 లక్షల ఓట్లపై అనుమానం ఉందని.. 71 వేల 977 ఫేక్ ఓటర్స్ ఉన్నారనన్నారు ఎంపీ రఘునందన్‌రావు. 92 వేల 447 మాస్ ఓటర్ నమోదు చేశారని... 54 వేల ఫేక్ బర్త్ డే సర్టిఫికేట్‌లు పెట్టారని ఆరోపించారు.బెంగాల్‌లో డైమండ్ హార్బర్ నియోజకవర్గంపై, యూపీలో అఖిలేష్ యాదవ్ సతీమణి డింపుల్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంపై మాకు అనుమానాలున్నాయని రఘునందన్ అన్నారు. ఓడిపోతే ఈవీఎంల మీద బురదజల్లి ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారు. రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్థలను కాంగ్రెస్ గౌరవించడం లేదు. ఆరోపణలు చేసే ముందు శాస్త్రీయంగా వ్యవస్థల మీద అధ్యయనం చేయాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు నిర్వహించాలి. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తే కేసీఆర్ ఎట్లా ఓడిపోతారు. బంగ్లాదేశ్, భారత్ సరిహద్దు ప్రాంతాల్లో గోడ కట్టాలన్న ప్రతిపాదనను మమత బెనర్జీ తిరస్కరించారు. సరిహద్దు గోడ లేకపోవడం వల్లే బెంగాల్ ద్వారా చొరబాటు దారులు దేశంలోకి ప్రవేశిస్తున్నారు. కేటీఆర్‌కు ఎండదెబ్బ కొట్టి తిక్కతిక్కగా మాట్లాడుతున్నారు. కోర్టు తీర్పులు భాజపాకి ఎందుకు చెంప పెట్టు అవుతాయి. ఎమ్మెల్సీల రద్దుపై తుది తీర్పు ఉంది. తుది తీర్పు వచ్చాక చెంప దెబ్బ ఎవరికి తగులుతుందో చూద్దాం అని రఘునందన్‌రావు అన్నారు. తన నియోజకవర్గంలో కూడా రోహింగ్యలకి ఓటు ఇచ్చారన్నారు. ఫారిన్ ఆర్గనైజేషన్ లు ఏజెన్సీలు దేశ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నాయని.. ఫండింగ్ చేస్తున్నాయన్నారు. దొంగ ఓట్లతో గెలిచారని కోర్టు చెబితే ఇందిరా గాంధీ ముఖం చూపించలేక కొంగు కప్పుకొని పోయిందని విమర్శించారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు బ్యాలెట్ పేపర్‌తో నిర్వహించాలని సూచించారు.

# ఆధారాలు ఏవీ రాహుల్.. షాక్ ఇచ్చిన ఈసీ

హైదరాబాద్,భారత ఎన్నికల సంఘంకాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ మధ్య ‘ఓటు చోరీ’ ఆరోపణల విషయంలో తీవ్ర వివాదం చోటుచేసుకుంది. దేశంలో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం గట్టిగా స్పందించింది. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, నిరాధారమైన ఆరోపణలు కాకుండా, స్పష్టమైన ఆధారాలు సమర్పించాలని కోరింది.

– ఈసీ ప్రకటనలోని కీలక అంశాలు:

ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రకటనలో, భారతదేశంలో 1951–52లో మొదటిసారి ఎన్నికలు జరిగినప్పటి నుంచి ‘ఒక వ్యక్తి – ఒక ఓటు’ అనే సూత్రం కఠినంగా అమలులో ఉందని స్పష్టం చేసింది. ఒక ఓటరుకు బహుళ ఓట్లు ఉన్నాయని రుజువు చేసే సాక్ష్యాలు ఎవరి వద్దనైనా ఉంటే, వాటిని అఫిడవిట్ రూపంలో తమకు సమర్పించాలని ఈసీ కోరింది.ఈసీ తన ప్రకటనలో ఒక ముఖ్యమైన విషయాన్ని నొక్కి చెప్పింది. ఆధారాలు లేకుండా కోట్లాది మంది ఓటర్లను ‘చోరులు’గా అభివర్ణించడం .. లక్షలాది మంది ఎన్నికల సిబ్బంది పారదర్శకతను ప్రశ్నించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని పేర్కొంది. ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని హెచ్చరించింది.

–రాహుల్ గాంధీ ఆరోపణలు:

రాహుల్ గాంధీ ఇటీవల కర్ణాటకలోని మహాదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో లక్ష ఓట్లు చోరీ అయ్యాయని ఆరోపించారు. ఈ నియోజకవర్గం బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ పరిధిలోకి వస్తుంది. ఈ ఓట్ల అవకతవకల కారణంగానే ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోయారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఆరోపణలపై ఇప్పుడు ఎన్నికల సంఘం ఆధారాలు కోరుతోంది.

–భవిష్యత్తులో ఆరోపణలపై ఈసీ వైఖరి:

ఎన్నికల సంఘం ఇలాంటి ఆరోపణలు చేసేవారు ఇకపై నిర్ధారిత సాక్ష్యాలను సమర్పించాలని మరోసారి స్పష్టం చేసింది. ఆధారాలు లేకుండా కేవలం వాదోపవాదాలకు దిగడం ప్రజాస్వామ్య వ్యవస్థకు హానికరం అని హెచ్చరించింది.




ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీతో సహా ప్రతిపక్ష నాయకుల ఆరోపణలకు ఎన్నికల సంఘం దృఢమైన వైఖరితో స్పందించడం ఇప్పుడు రాజకీయ వర్గాలలో తీవ్ర చర్చకు దారితీసింది.

## ఎప్పటికైనా అఖండ భారత్ ఏర్పాటు తప్పదు

నాగపూర్,అనివార్య పరిస్థితుల్లో ఆనాడు దేశ విభజన జరిగిందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. భారత్–పాకిస్థాన్‌లు విభజనను గుర్తుచేసుకుంటే.. అనివార్య పరిస్థితుల్లోనే నాడు దేశ విభజన జరిగిందని గుర్తించాలని అన్నారు. ఏదో ఒకరోజు మళ్లీ అఖండ దేశంగా భారత్ మారుతుందని గడ్కరీ పేర్కొన్నారు. భారత్‌ను సూపర్ పవర్, విశ్వగురువుగా మార్చాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పిలుపునిచ్చారు. ప్రతి రంగంలో మనం బలంగా ఉంటేనే ప్రపంచం భారత్ మాట వింటుందన్నారు. నాగ్‌పుర్‌లో రాష్ట్ర నిర్మాణ్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. అప్పట్లో భిన్నత్వంలో ఏకత్వం భావనతో భారత్ దూసుకెళ్తోందన్న ఆయన.. సాయుధ బలగాల పనితీరుపై ప్రశంసలు కురిపించారు. భారత్‌ను 5 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com